Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 22.01.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 34 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## జిల్లా రాజకీయాల్లో మలుపు...

# విపిఆర్‌కు పార్టీల పిలుపు



3లో

- మా గూటికి రమ్మంటున్న దేశం, బీజేపీలు
- గ్లామర్ స్టార్‌ను నిలుపుకోలేకపోతున్న జగన్



- అవకాశవాదుల అపూర్వ సంగమం

## ఇదే...

# రాజనీతి!

**రాజకీయాలు నీచంగా ఉంటాయని తెలుసు. దుర్మార్గంగా ఉంటాయనీ తెలుసు. అవకాశవాదంతో ఉంటాయని, బరితెగించాయని, విలువలు కోల్పోయాయని కూడా తెలుసు. ఇప్పుడు అంతకంటే ఇంకా దిగజారా యేమోననిపిస్తుంది విజయవాడలో జరిగిన ఆనం బ్రదర్స్ షోను చూస్తుంటే! రాజకీయాలలో విమర్శలు, ప్రశంసలు సాధారణం. నాయకులు పార్టీలు మారడమూ మామూలే! అయితే దేనికైనా ఒక కొలమానం ఉం టుంది. నిన్న మనం విమర్శించిన వ్యక్తిని ఈరోజు ప్రశంసించాలంటే నోరు అంత సామాన్యంగా తెరవలేము. అంతరాత్మ అసలు ఒప్పుకోదు.**

విజయవాడలో జరిగిన 'షో'లో మాత్రం అంతరాత్మను కూడా లక్ష్య పెట్టక ఆనం సోదరులు చంద్రబాబును పొగడ్తలతో ఆకాశానికెత్తేసారని చెప్పొచ్చు. 2014 ఎన్నికలప్పుడుగాని ఆ తర్వాత తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక గాని కాంగ్రెస్ పార్టీ నుండి చాలామంది నాయకులు తెలుగుదేశంలో చేరారు. వాళ్లెవరు కూడా పొగడనంత స్థాయిలో ఆనం బ్రదర్స్ చంద్రబాబును కీర్తించడం ప్రజలనే కాదు తెలుగుదేశం కార్యకర్తలను సైతం నివ్వెరపరిచింది. (మిగతా 10వ పేజీలో)



## అంతరిక్షంలో...

# మరో హిట్

- పిఎస్‌ఎల్‌వి-సి31 సక్సెస్

(వివరాలు 10వ పేజీలో)

శుభాకాంక్షలు

పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు

గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

సం/-

# 'బాలు'కు ఆత్మీయ సత్కారం



**ప్రముఖ సినీ నేపథ్యగాయకుడు, గానగంధర్వుడు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యంకు మరో అరుదైన గౌరవం లభించింది. సినీ రంగంలో ప్రవేశించినప్పటినుంచి ఇప్పటిదాకా దాదాపు 40 వేలకు పైగానే పాటలను తన అద్భుతమైన స్వరంతో గానం చేసి అశేష ప్రజలను తన గానమాధుర్యంతో తన్మయుల్ని చేస్తున్న బాలూకి ఇది ఎంతో గౌరవప్రదమైన, సమున్నతమైన సత్కారం.**

నేపథ్యగానంలో 50 వసంతాలు పూర్తిచేసుకున్న బాలూను ఆదివారం ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోడీ, లోక్‌సభ స్పీకర్ సుమిత్ర మహాజన్‌లు ఘనంగా సత్కరించారు. 50 ఏళ్ళపాటు సంగీత యాత్ర కొనసాగించడం సరళమైన పనికాదని ఈ సందర్భంగా ప్రధాని మోడీ బాలూను ప్రశంసించారు. అంతేకాక, ఉన్నత శిఖరాలకు వెళ్ళిన తర్వాత కూడా సాధనను స్వచ్ఛభారత్ కోసం (మిగతా 10వ పేజీలో)



# నేల కదులుతోంది... పల్లె వణుకుతోంది!

## ఉదయగిరిని వీడని భూకంప నీడలు




జిల్లాలోని మెట్ట ప్రాంతమైన ఉదయగిరికి ప్రకృతిపరంగా ఎప్పుడూ శాపమే. శూర్పణఖకు పసుపు కుంకుమ క్రింద రావణాసురుడు ఈ ప్రాంతాన్ని ఇచ్చాడని పెద్దలు చెబుతుంటారు. అందుకనే ఇక్కడ పెద్దగా వర్షాలు పడవని, పంటలు పండవని చెబుతారు. ప్రకృతి పరంగా ఈ ప్రాంతానికి ఎంతటి శాపముందనేది సోమశిల నీళ్లను చూస్తే తెలుస్తోంది. జిల్లా రైతాంగానికి వరప్రసాదమైన సోమశిల రిజర్వాయర్ నీళ్లు 250 కిలోమీటర్ల దూరంలో వున్న చెన్నైకు వెళుతుంటాయి. గట్టిగా 20కిలోమీటర్ల దూరం కూడా లేని ఉదయగిరి ప్రాంతానికి మాత్రం సోమశిల నీళ్లు ఎక్కువు. ప్రకృతి పరంగా వర్షాభావం, తీవ్ర కరువు పరిస్థితులు ఈ ప్రాంతాన్ని తంచన్‌గా వెంటాడుతుంటాయి. అలాగే కోస్తా తీరానికి దగ్గర లోనే వుంది కాబట్టి అప్పుడప్పుడూ తుఫాన్‌ల ముప్పు తప్పదు.

ప్రస్తుతం ఇవే కాకుండా ఉదయగిరి పల్లెలను భూకంపం భయపెడుతోంది. గత మూడు నెలల కాలంలో 9సార్లు ఈ ప్రాంతంలో భూప్రకంపనలు సంభవించాయి. ఈ నెల 20వ తేదీ ఉదయం కూడా ఇక్కడ భూమి రెండు సెకన్ల పాటు కదిలింది. ఇటీవల తరచూ భూ ప్రకంపనలు వస్తుండడంతో భూకంపాలపై ప్రజలకు బాగానే అవగాహన వచ్చింది. భూమి కదిలినట్లు అనిపిస్తే చాలు ఇళ్లు వదిలి రోడ్ల మీదకు పరుగులు తీస్తున్నారు. 20వ తేదీ పెద్ద శబ్దంతో భూకంపం రావడంతో అందరి గుండెలు అదిరిపోయాయి. ఇప్పుడు ఏ రకమైన శబ్దాలు వచ్చినా అది భూకంపమేననే భ్రాంతికి లోనవుతున్నారు. వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు, ఉదయగిరి మండలాలలో తరచూ ప్రకంపనలు వస్తున్నాయి. 2004లో సంభవించిన సునామీ తర్వాత భూమి పొరల్లో పెనుమార్పులు సంభవించాయి. భూమి అడుగు భాగంలోని పలకల్లో పెద్దఎత్తున కదలిక వచ్చింది. ఉదయగిరి ప్రాంతంలోని భూమి పొరల్లో కూడా అలాంటి మార్పులే వచ్చి ఉంటాయని, దానివల్లే భూ ప్రకంపనలు వస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రకాశం జిల్లా అద్దంకి నుండి నెల్లూరుజిల్లా ఉదయగిరి వరకు వున్న ప్రాంతమంతా ఒకే పలక మీద వుందని, పలకల్లో సర్దుబాటు జరిగేటప్పుడు ఇలా ప్రకంపనలు రావడం సహజమని, అయితే ఇవి ప్రమాదకర స్థాయిలో వుండవని శాస్త్రవేత్తల అభిప్రాయం. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు కూడా ఉదయగిరి భూప్రకంపనలపై ఆరా తీస్తూ, ఇవి ఏమీ చేయవని, గుండెల మీద చేయేసుకుని హాయిగా నిద్రపోండని సందేశం పంపారు. జిల్లా కలెక్టర్ జానకి ఇక్కడ తరుచూ వస్తున్న ప్రకంపనలపై అధ్యయనానికి భూగర్భ శాస్త్రవేత్తల బృందాన్ని సిద్ధం చేశారు. ఉదయగిరి ప్రాంతంలో సాధారణ జీవితమే చాలా కష్టంగా వుంటుంది. పనులు తక్కువ, పరి శ్రమలు లేవు. ఉపాధి కోసం ఇక్కడ నుండి ఇతర ప్రాంతాలకు వలసలు ఎక్కువ. వీటికి భూకంపాలు తోడైతే ఉదయగిరి నిర్మానుష్యమే!

## గురువులను సత్కరించుకున్న పూర్వ విద్యార్థులు

పాఠాలు చెప్పి, ఉన్నతమైన విలువలు బోధించి.. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేది గురువులేనని, అలాంటి గురువుల రుణం ఏనాటికీ తీర్చుకోలేనిదని పలువురు పూర్వవిద్యార్థులు గురువుల విశిష్టతను కొనియాడారు. విద్యార్థుల అభివృద్ధికి ఓనమాలు దిద్దేది గురువులేనని అన్నారు. ఆత్మకూరులోని జడ్పీ పాఠశాల (వెస్ట్)లో ఈ నెల 17న పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. అనేకమంది పూర్వవిద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆ పాఠశాలలో వారు చదువుకున్న రోజులను, నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందించారు. పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కె.వి శేషారెడ్డి, ఎంఇఓ జయకుమార్, ఉపాధ్యాయులు రమణరావు, సంజన, గఫూరిన్నిసా, వసంతకుమారి తదితరులతో పాటు స్థానిక ప్రముఖులు, నాయకులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ, సమాజంలో తమను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు తాము ఎల్లప్పుడూ రుణపడి వుంటామన్నారు. పాఠశాల అభివృద్ధికి, పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. పూర్వవిద్యార్థుల ఆత్మీయతకు ఉపాధ్యాయులు, స్థానికులు ఎంతో ఆనందించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, విజయభాస్కరరెడ్డి, కిషోర్‌రెడ్డి, అస్లాం, ప్రవీణ్, అజయ్, వాణి, లక్ష్మి, సుప్రజ, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## గంగపట్నం చాముండేశ్వరిదేవికి కుంకుమార్చన

ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం గ్రామంలో వెలసివున్న శ్రీ చాముండేశ్వరి అమ్మవారికి ఆదివారం ఆలయ అర్చకులు వైభవంగా కుంకుమార్చనలు, ఖడ్గమాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పది రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఇ.ఓ మధుసూదనరావుతో పాటు బి. వెంకురెడ్డి, శరత్‌నాయుడు, వేణుంబాకం మహీధర్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## క్రికెట్‌లో పెరుమాళ్ళపాడు హిట్

చేజర్ల మండలంలోని పెరుమాళ్ళపాడు గ్రామంలో నిర్వ హించిన సంక్రాంతి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పెరుమాళ్ళపాడు యూత్ టీమ్ జట్టు విజేతగా నిలిచింది. వారం రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో 12జట్లు పాల్గొనగా, పెరుమాళ్ళ పాడు విన్నర్‌గా, చేజర్ల జట్టు రన్నర్‌గా విజయం సాధించాయి. గ్రామ ప్రముఖుడు ముఖేంద్రచౌదరి సహకారంతో ప్రథమ బహు మతి విజేతలకు నగదు బహుమతిని అందజేయగా, పెరుమాళ్ల పాడు సాగునీటి సంఘం అధ్యక్షుడు కిలారి జయరామయ్య ద్వితీయ బహుమతిని అందజేశారు. బహుమతి ప్రదానోత్సవంలో మండల వైఎస్సార్సీపి నాయకుడు జయంతులునాయుడు, స్థానిక ప్రము ఖులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా గ్రామోత్సవం

సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని కనుమ పండుగ నాడు మండల కేంద్రమైన కోటలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి గ్రామస్తులు కన్నుల పండువగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవంలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎంతో కాలం నుంచి ఈ గ్రామంలో సంప్రదాయబద్ధంగా వస్తున్న అమ్మ వారికి గ్రామోత్సవ ఆచారాన్ని పురస్కరించుకుని గత పదిహేను రోజులుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 16వ తేదీ రాత్రి అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. తప్పెట్లు తాళాలు, పాటకచ్చేరీలతో, అమ్మవారి నామస్మరణలతో గ్రామం మార్మోగిపోయింది. ఆలయ నిర్వాహకులు, గ్రామపెద్దలు, యువకులు అందరూ కలిసి ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు.

## వాలీబాల్‌లో నాయుడుపేట విజయం

వెంకటగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో రెండు రోజులపాటు జరిగిన వాలీబాల్ పోటీల్లో నాయుడుపేట జట్టు విజయం సాధించింది. ఆదివారం జరిగిన ఈ పోటీలో వెంకటగిరి–నాయుడుపేట జట్లు పోటాపోటీగా తలపడగా నాయుడుపేట జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో విజేతలైన నాయుడుపేట జట్టు క్రీడాకారులకు మాజీ ఎంఎల్ఏ డా. విబి సాయికృష్ణ యాచేంద్ర 10వేల రూపాయల నగదును, షీల్డును బహుకరించారు. జివిఆర్ సర్వీస్ ట్రస్ట్–వెంకటగిరి వాలీబాల్ క్లబ్ సంయుక్తంగా ఈ పోటీలు నిర్వహించాయి. ఈ పోటీల్లో మొత్తం 16జట్లు పాల్గొన్నాయి. విజేతలకు బహుమతుల ప్రదా నోత్సవంలో ఆ ట్రస్ట్ ఛైర్మెన్ జి.నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ రవీంద్రబాబు, టిడిపి నాయకులు చేవూరు విజయమోహన్‌రెడ్డి, పి. రాజేశ్వరరావు, మునిసిపల్ వైస్‌ఛైర్మెన్ బీరం రాజేశ్వరరావు, నాయకులు చెలికం శంకరరెడ్డి, రంగినేని వెంకటేశ్వర్లు, విజయసారథి, ఎస్ఐ ఆంజనేయరెడ్డి, న్యాయవాదుల సంఘం కార్యదర్శి ఎల్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇరుకళలమ్మ గుడి సభ్యుల నియామకం

నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా పలువురిని నియమిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ అనూరాధ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులుగా మెట్టు సురేష్‌బాబు, పి.బాలసుబ్రహ్మణ్యం, ఉచ్చూరు సురేష్, అలిమిలి శ్రీహరి ఆచారి, ఒట్టూరు సుధాకర్, రాపూరు కృష్ణసుధ, పంట్రంగి వెంకటేశ్వర్లును నియమించారు. ధర్మకర్తల మండలి ఛైర్మెన్ ఎన్నిక త్వరలోనే వుంటుందని ఆలయ ఇఓ ఏ.వి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు.




## యువతకు స్ఫూర్తిగా... మాగుంట శరత్‌చంద్రారెడ్డి స్పోర్ట్స్ క్లబ్

# సంక్రాంతి క్రీడా సంబరాలు



సంక్రాంతి క్రీడా సంబరాల్లో విజేతలకు బహుమతులందజేస్తున్న జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవ, ఎమ్మెల్సీ మాగుంట శీనయ్య



పక్షుల పండుగ సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఎంఎస్‌ఆర్ స్పోర్ట్స్ క్లబ్ జట్టు

నెల్లూరులో గత కొంతకాలంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ అందరి అభిమానాన్ని చూరగొంటున్న మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి ఈ యేడాది సంక్రాంతి సందర్భంగా నెల్లూరులోని విఆర్‌సి మైదానంలో ఖోఖో, కబడ్డీ, ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించింది. మాగుంట శరత్‌చంద్రారెడ్డి స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ క్రీడా సంబరాన్ని నిర్వహించారు. విఆర్‌సి మైదానంలో గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా ముగ్గులతో అలంకరించడమే కాక గంగిరెద్దులు, భోగి మంటలు ఏర్పాటు చేసి అతిథులకు అరిసెలు పంచి సంక్రాంతి శోభను కళ్లకు కట్టారు. 14వ తేదీ మాజీ శాసనసభ్యులు జె.కె.రెడ్డి, తెలుగుగంగ సిఇ ఏ.సుధాకర్‌లు ఈ క్రీడా సంబరాలను ప్రారంభించారు. జిల్లాలోని అన్ని మండలాల నుండి 700 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. క్రీడాకారులందరికీ మాగుంట శరత్‌చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి కల్పించారు. కబడ్డీ పోటీలలో పురుషుల విభాగంలో 35జట్లు, మహిళల విభాగంలో 12జట్లు తలపడగా, ఖోఖో పోటీలలో పురుషుల విభాగం నుండి 18జట్లు, మహిళల విభాగం నుండి 10జట్లు పోటీ పడ్డాయి.

కబడ్డీ పోటీలలో పురుషుల నుండి కొల్లేటి కింగ్స్, తడ జట్టు ప్రథమస్థానం(10వేలు), ఎంఎస్‌ఆర్ స్పోర్ట్స్ క్లబ్ ద్వితీయ స్థానం(6వేలు), లేగుంటపాడు జట్టు మూడవ స్థానం(4వేలు) గెలుచుకున్నాయి. అలాగే మహిళల విభాగంలో ఎంఎస్‌ఆర్ స్పోర్ట్స్ క్లబ్ ప్రథమస్థానం(4వేలు), సిఎస్‌ఆర్ పురం జట్టు ద్వితీయస్థానం (3వేలు), గొలగమూడి ఆశ్రమ పాఠశాల జట్టు(2వేలు) తృతీయ స్థానంలో నిలిచాయి. ఖోఖో పోటీలలో పురుషుల విభాగంలో యంఎస్‌ఆర్ స్పోర్ట్స్ క్లబ్ మొదటి స్థానం(4వేలు), ఊటుకూరు జట్టు ద్వితీయస్థానం(3వేలు), కొమరిక జట్టు తృతీయ స్థానం (2వేలు) పొందాయి. మహిళల విభాగంలో ఎంఎస్‌ఆర్ స్పోర్ట్స్ క్లబ్ మొదటి స్థానం(4వేలు), కొమరిక జట్టు ద్వితీయ స్థానం (3వేలు), గొలగమూడి ఆశ్రమ పాఠశాల తృతీయ స్థానం(2వేలు) సాధించాయి. విజేతలకు 15వతేదీ సాయంత్రం విఆర్‌సి గ్రౌండ్‌లో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డిలు బహుమతి ప్రదానం చేశారు. విఆర్‌సి గ్రౌండ్‌లో సంక్రాంతి వాతావరణాన్ని ఉట్టిపడేలా చేసారని ఇక్కడ చూస్తుంటే పల్లెటూర్లో వున్నట్లే వుందని మాగుంట శీనయ్య పరవశంతో చెప్పారు. చిన్న వయసులోనే పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేపడుతున్న మాగుంట శరత్‌చంద్రారెడ్డిని ఆయన అభినందించారు. బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, శరత్‌చంద్రారెడ్డికి తన అభినందనలు తెలుపుతూ సేవా కార్యక్రమాలతో మరింతగా దూసుకుపోవాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ మాగుంట వెంకట నారాయణరెడ్డి, రవీంద్రరెడ్డి, నిఖిల్‌రెడ్డి, సాయి, అశోక్ కూడా పాల్గొన్నారు.

## అపోలోలో అరుదైన చికిత్స



కాలు స్పర్శ కోల్పోయి బాధపడుతున్న వ్యక్తిని అపోలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు ఆధునిక వైద్యం ద్వారా పూర్వస్థితికి తెచ్చారు. ఆసుపత్రి కార్డియాలజిస్టు డాక్టర్ విజయ్ అమర్‌నాథ్‌రెడ్డి మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరు పెద్దబజారుకు చెందిన నదీమ్ కుడికాలుకి తీవ్రమైన నొప్పి వచ్చి ఆసుపత్రికి తీసుకొచ్చేలోగా స్పర్శ కోల్పోయాడన్నారు. కలర్ డాప్లర్ పరీక్ష, ఫెరిపెరల్ యాంజియోగ్రామ్ చేయగా కాలు రక్తనాళంలో రక్తం గడ్డకట్టిన విషయాన్ని గుర్తించినట్లు తెలిపారు. కెథీటర్ బేస్డ్ ఇంట్రా ఆర్టీరియల్ థ్రాంబోలైటిక్ విధానం ద్వారా అత్యాధునిక చికిత్సను అందించి కాలు పూర్వస్థితికి వచ్చేలా చేసామన్నారు. ఈ వైద్యంలో భాగస్వాములైన డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ శ్వేతారెడ్డిలను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి యూనిట్ హెడ్ వి.నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

**కాలధర్మం**

## మన్నెం కృష్ణమోహన్‌రెడ్డి



నెల్లూరు వాస్తవ్యుడు హైదరాబాద్ నివాసి మన్నెం కృష్ణమోహన్‌రెడ్డి తన 59వ యేట జనవరి 16 సాయంత్రం తుదిశ్వాస విడిచాడు. కృష్ణమోహన్ స్వస్థలం నెల్లూరు. ఎల్‌కెజి నుండి ఎల్‌ఎల్‌బి దాకా ఆయన విద్యాభ్యాసం నెల్లూరులోనే గడిచింది. విద్యార్థి దశలో మంచి క్రికెట్ క్రీడాకారుడిగా ఆయన ప్రసిద్ధి. చదువుకునే రోజుల నుండే మంచి స్నేహసంబంధాలు కలిగిన వ్యక్తిగా ఆయనకి పేరుంది. విద్యాభ్యాసం పూర్తి చేసి కొంతకాలం చెన్నైలోని చందమామ పబ్లికేషన్స్‌లో పనిచేసిన తరువాత సెంట్రల్ స్టాటిస్టిక్స్ శాఖలో సెన్సెస్ విభాగంలో కేంద్రప్రభుత్వ ఉద్యోగం కూడా చేసి అనంతరం తనకి అత్యంత ఇష్టమైన ఆతిథ్య రంగంలో ఆయన స్థిరపడ్డాడు. హైదరాబాదులోని "శిల్పకళావేదిక"ను నిర్వహిస్తుండిన అలీఫ్ రిసార్ట్స్ & రిక్రియేషన్స్ సంస్థలో కమర్షియల్ డైరెక్టర్‌గా తన సేవల ద్వారా ఎంతోమంది అభినందనలను కూడా కృష్ణమోహన్ అందుకున్నాడు. తెలంగాణ ఏర్పడడం "శిల్పకళావేదిక" నిర్వహణ సంస్థకు కాలపరిమితి ముగియడంతో కొద్దికాలం నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జనరల్ మేనేజర్‌గా పనిచేసి అనంతరం హైదరాబాదులోని కావూరిహిల్స్‌లో "కృష్ణాస్ కిచెన్" పేరుతో మల్టిక్యూసైన్ రెస్టారెంట్‌ను ప్రారంభించి అనతికాలంలోనే ఆ రెస్టారెంట్‌ను అగ్రస్థానంలో వుంచాడు.

కృష్ణమోహన్‌కి భార్య మనోరమ, కుమారుడు శ్రీహర్ష, కుమార్తె శ్రీవర్ష వున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ జనవరి 16వ తేది తుదిశ్వాస విడిచాడు. ఎన్నో వందల పెళ్ళిళ్ళను తన స్వహస్తాల మీదుగా చేసిన కృష్ణమోహన్‌ను తన బిడ్డల పెళ్ళిళ్ళు చూడకుండానే పైవాడు తీసుకెళ్ళిపోయాడు. కృష్ణమోహన్ తన కుటుంబసభ్యులకు ఎంత ప్రాధాన్యత ఇస్తాడో తన స్నేహితులకు కూడా అంతే విలువిచ్చేవాడు. స్నేహం ఆయనకు ఓ వ్యసనమనే చెప్పవచ్చు.

ఓ మంచి స్నేహితుడిని కోల్పోయిన ఆయన మిత్రులకి తమ ఇంటి పెద్ద దిక్కుని కోల్పోయిన ఆయన కుటుంబసభ్యులకు భగవంతుడు మనోస్థైర్యాన్ని కల్గించాలని కోరుకుంటూ ప్రగాఢ నివాళి అర్పిస్తోంది "లాయర్".

# విపిఆర్‌కు పార్టీల పిలుపు

***వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(విపిఆర్)... ఈ పేరంటేనే నెల్లూరుజిల్లాలో ఓ సంచలనం. వ్యాపార రంగంలో ఆయనో స్టార్, ఆధ్యాత్మిక రంగంలో సూపర్‌స్టార్, సేవారంగానికి మెగాస్టార్. అయితే ఇప్పుడు రాజకీయ రంగంలో గ్లామర్‌స్టార్‌గా నిలిచాడు. అందరూ రాజకీయాలలోకి వచ్చి సేవ చేస్తామంటుంటే ప్రభాకర్‌రెడ్డి సేవకుడిగా తనను తాను ఎప్పటికప్పుడు కొత్తగా ఆవిష్కరించుకుంటూనే నెల్లూరు జిల్లాలో సేవకు తానే ఓ చిరునామాగా అనిపించుకుంటూనే ఇప్పుడు రాజకీయరంగంలో తన ప్రస్థానాన్ని ప్రారంభించబోతున్నాడు.***

గత ఎన్నికలకు ముందుగానే అధికారికంగా రాజకీయ రంగ ప్రవేశం చేసి చెన్నైలో వై.యస్.జగన్ సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. 2014 ఎన్నికల్లోనూ అంతకుముందు కూడా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ కోసం ఆయన కోట్లు ఖర్చు చేశాడు. బహుశా రెండు తెలుగు రాష్ట్రాల్లో వై.యస్.ఆర్ కాంగ్రెస్‌ను విపిఆర్ ఆదుకున్నంతగా వేరెవ్వరూ ఆదుకోలేదన్నది అక్షర సత్యం.

దివంగత ముఖ్యమంత్రి, ప్రజానాయకుడు డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డితో విపిఆర్‌కి అత్యంత సన్నిహిత సంబంధాలుండేవి. తనకున్న అతి కొద్దిమంది ఆప్త మిత్రులలో ప్రభాకర్‌రెడ్డిని ఒకడిగా డా॥ రాజశేఖరరెడ్డి చూసేవాడు. వి.పి.ఆర్ అంటే వై.యస్.కి వల్లమాలిన అభిమానం. వై.యస్. అంటే విపిఆర్‌కి అపార గౌరవం. ఆ గౌరవంతోనే ఆయన కుమారుడికి అండగా నిలిచాడు విపిఆర్. కాని, విపిఆర్‌కి దక్కాల్సిన ప్రాధాన్యత, గౌరవం ఆ పార్టీలో ఆయనకు దక్కలేదనే చెప్పాలి. రాజన్న తరచూ వాడే "విశ్వసనీయత" అన్న పదానికి ప్రస్తుతం జగన్ కోటరీలో అర్థమేలేదన్న భావనకు నిలువెత్తు సాక్ష్యం విపిఆర్.

పదవులపై వ్యామోహంతో విపిఆర్ వై.యస్.ఆర్‌కి దగ్గర కాలేదు. సేవా తత్పరుడిగా, వ్యాపారవేత్తగా, ఆధ్యాత్మిక చింతన కలిగిన భక్తుడిగా ఆయనకు అన్ని పార్టీల వారితోనూ సత్సంబంధాలున్నాయి. అందరూ ఆయనకు ఆప్తులే, అందరూ ఆయనకి కావలసిన వారే. కానీ, కేవలం 'రాజన్న'తో వుండిన స్నేహబంధంతోనే ఆయన 'జగన్'కి బాసటగా నిలిచాడు. వై.యస్.ఆర్ పార్టీకి అండగా వున్నాడు. కానీ, ఆయనకి తగిన విలువ ఆ పార్టీలో లభించడం లేదు.

రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కాకముందూ, అయిన తర్వాత కూడా అతి సామాన్యుడు సైతం వై.యస్.ని నేరుగా కలవగలిగేవాడు. సామాన్యుడు సైతం ఆయనకు సలహాలు, సూచనలు ఇచ్చేవాడు. కాని, వైయస్ఆర్ పార్టీలో ఆ పరిస్థితి లేదు. పార్టీకి అండగా వుండి కోట్లు ధారపోసిన విపిఆర్ లాంటి వాళ్లు అధినేతను కలవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సిందే! సమయం ఇచ్చేవరకు వేచి వుండాల్సిందే. అధినేత చుట్టూ ఓ వలయం ఏర్పడిపోయింది. ఆ వలయంలో వున్నవారు ఏం చెప్తే అదే ఆయన వినే పరిస్థితి ఏర్పడిపోయింది. బాహ్య సమాజంలో వాస్తవ పరిస్థితులు ఆయనకు చెప్పగలిగే సామాన్యుడు ఆయనను కలిసే పరిస్థితే లేదు. ఈ పరిణామమే మొన్నటి ఎన్నికల్లో ఓటమికి కారణమన్నది రాజకీయ మేధావుల అభిప్రాయం.

వై.యస్.రాజశేఖరరెడ్డి చెప్పుడు మాటలు వినేవాడు కాదు. తనకంటూ తన వాళ్ళను ప్రతి జిల్లాలో రాజకీయాలతో సంబంధం లేకుండా పెట్టుకునేవాడు. వాళ్లను పూర్తిగా విశ్వసించేవాడు. వాళ్లు చెప్పింది విని తనకంటూ ఓ అభిప్రాయానికి వచ్చి నిర్ణయాలను తీసుకునేవాడు. తన చుట్టూ వున్న వాళ్ల గురించి బయటవాళ్లు వ్యతిరేకంగా మాట్లాడితే వినేవాడు కాదు. తనవాళ్ల గురించి తనకంటూ ఓ అవగాహన ఏర్పరుచుకుని పూర్తిగా వారిపై ఆధారపడేవాడు. ప్రస్తుతం వై.యస్.ఆర్ పార్టీలో ఆ పరిస్థితి లేదు. అందుకు ఉదాహరణ వై.యస్.కు అత్యంత సన్నిహితంగా వుంటూ ఆయన కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధపడగలిగిన ఆయన ఆప్తులు ఒక్కరంటే ఒక్కరు కూడా ఈరోజు జగన్‌కు సన్నిహితంగా లేకపోవడం.

విపిఆర్ లాంటి వ్యక్తి మనస్థాపానికి గురయ్యే పరిస్థితి 'జగన్' చుట్టూ వున్న వాళ్లు కల్పిస్తున్నారంటే ఆయన చుట్టూ ఎలాంటి రాజకీయ అవగాహన, రాజకీయ పరిజ్ఞానం కలిగిన వాళ్లు వున్నారో అర్థం చేసుకోవచ్చున్నది రాజకీయ జోస్యుల అభిప్రాయం.

ఇప్పుడు విపిఆర్ జిల్లా రాజకీయాలలోనే కాదు, రాష్ట్ర రాజకీయాలలో సైతం ఓ గ్లామర్ స్టార్. ఆయనకు జిల్లాలో వున్న మంచిపేరు అంతా ఇంతా కాదు. ఆయనని తెలియని జిల్లా వాసులే లేరు. గత 20యేళ్ళుగా ఆయన సేవల ద్వారా ఆయన పేరు జిల్లా అంతటా మారుమ్రోగుతోంది. తన ఫౌండేషన్ ద్వారా ఆయన త్వరలో ప్రారంభించనున్న విపిఆర్ విద్య, విపిఆర్ వైద్యం వంటి సేవలతో ఆయన పేరు జిల్లా సేవా రంగంలో సువర్ణక్షరాలతో లిఖించబడుతుందనడంలో అతిశయోక్తి లేదు.

ఆ గ్లామర్ ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీలను ఆకర్షిస్తోంది. తెలుగుదేశం, బిజెపి పార్టీలు ఆయనను తమ పార్టీలోకి రమ్మని ఆహ్వానిస్తున్నాయి. ఇంతటి గ్లామర్ కలిగిన వ్యక్తి తమ పార్టీలో వున్నా, ఆయన గ్లామర్‌ని వై.యస్.ఆర్. పార్టీ వాళ్ళు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

తనకి పదవులు ముఖ్యం కాదు, ప్రజా శ్రేయస్సే ధ్యేయం అంటూ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన సేవా ప్రస్థానాన్ని మరింత ముందుకు తీసుకుపోతున్నాడు. ఆయన సేవకు తోడుగా పదవి లభిస్తే అది సేవా లక్ష్యాలకు మరింత ఉపకరిస్తుందే తప్ప, పదవుల వల్ల ఆయనకు కొత్తగా వచ్చే పేరేమీ లేదన్నది ప్రజాభిప్రాయం.

గంటలో 40నిమిషాలు ప్రజలకు ఏ విధంగా సేవ చేయాలో అని ఆలోచించే విపిఆర్ వంటి వ్యక్తులు ప్రత్యక్ష రాజకీయాలలోకి రావడమంటే మంచి పరిణామమే. ఇలాంటి వ్యక్తుల వల్ల పార్టీలకు లాభమే తప్ప, విపిఆర్ లాంటి వాళ్ళకు పార్టీల వల్ల వొరిగేదేమీ వుండదు. ఇప్పటికైనా వైకాపా శ్రేణులు మేల్కొంటే పార్టీకి నష్టం జరగకుండా కాపాడుకోవచ్చు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## 'ప్రభా'తం

# 'అంకురా'ర్పణ



దేశం పారిశ్రామికంగా ముందంజ వేసినప్పుడే, ఆర్థికపరమైన ఇబ్బందులన్నిటినీ అధిగమించి ప్రగతి రథచక్రాలు పరుగు అందుకున్నప్పుడే దేశానికి నిజమైన అభివృద్ధి సాకారమవుతుంది. ఈ సూక్ష్మాన్ని గ్రహించిన ప్రధాని మోడీ..'అంకురభారత్'తో భారత్ నేల నాలుగు చెరగులా విస్తారంగా పారిశ్రామిక అంకురాలు నాటబోతున్నారు. భవిష్యత్తులో ఈ అంకురాలే మొలకలై.. మానులై.. మహావృక్షాలై దేశప్రజలకు చల్లటి నీడనిస్తాయని, దేశమంతటా ఆహ్లాదంగా ప్రగతి గాలులు వీస్తాయని ఆశించవచ్చు.

సాధారణంగా నాయకులు ఇచ్చిన హామీలకు.. ఆ తర్వాత చేసే పనులకు పెద్దగా పొంతన వుండదు. కొంతమంది హామీలిచ్చినా కంటితుడుపు పనులు చేసేసి సరిపెట్టుకుంటుంటారు. మరికొందరు అసలు ఇచ్చిన హామీల జోలికే పోరు. కానీ, మోడీ అలా కాదు. భారత్‌పై తాను కన్న కలలను సాకారం చేసే దిశగా నిరంతర ఆలోచనలతో అడుగులు వేస్తూ, చెప్పిన మాటలకు తగ్గ పనులు చేస్తూ ఆయన అందరి ప్రశంసలూ అందుకుంటున్నారు.

తాజాగా, తాను ఇచ్చిన హామీ నెరవేర్చే దిశలో భాగంగా, తన మానస పుత్రిక అయిన 'అంకుర భారత్'ను ప్రధాని మోడీ ఆవిష్కరించడం దేశవ్యాప్తంగా చిన్న పరిశ్రమలకు ఒక పెద్ద వూపునిస్తోంది. వ్యాపారాభివృద్ధికి దోహదం చేసే ఆలోచనలున్నవారికి, పరిశ్రమ స్థాపించి తనకే కాక, పదిమందికీ జీవనోపాధి కల్పించాలనుకునే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకీ 'అంకుర భారత్' ఎర్రతివాచీ పరుస్తోంది.

సహజంగా పరిశ్రమలంటేనే ఏ గొప్పధనవంతులకు మాత్రమేననే భావన నుంచి, సంకల్పం వుండాలే గానీ మట్టిలో మాణిక్యాలెన్నో వుంటాయని మరోసారి రుజువుచేసేందుకు ప్రధాని మోడీ అంకుర భారత్‌పై దృష్టి సారించారని చెప్పవచ్చు. అందుకే, చిన్న పరిశ్రమలకు పెద్ద పీట వేస్తూ, ఆరంభ సంస్థలకు శుభారంభం చెప్తూ ప్రధాని మోడీ ఈ నెల 17న తీసుకున్న నిర్ణయం దేశవ్యాప్తంగా పారిశ్రామిక వ్యాపారోద్దీపనకు మార్గం సుగమం చేస్తోంది. 'అంకుర' పరిశ్రమల స్థాపనకు అంకురార్పణ చేస్తూ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను, యువ వ్యాపారవేత్తలను ప్రోత్సహించే దిశలో భారత్‌లో 'స్టార్టప్ ఇండియా'కు ఉత్సాహ ప్రోత్సాహాలనిచ్చేందుకు ప్రధాని సంకల్పించడం ఎంతైనా శుభపరిణామం. సంక్రాంతి పండుగల సంబరాల సందడిలో నిజమైన సంక్రాంతి పండుగను ఆవిష్కరించేలా అంకురభారత్‌కు అంకురార్పణ జరగడం విశేషం. 'అంకుర భారత్' గురించి నాడు ఎర్రకోట సాక్షిగా చెప్పాను..ఇప్పుడు మనం దాని సాకారాన్ని చూస్తున్నాం. ఈ క్రతువులో అందరం కలిసే వున్నాం''.. అంటూ ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేయడం ఆయన నిజాయితీకి, నిబద్ధతకు నిదర్శనం. అంతేకాదు, పారిశ్రామిక రంగానికి ఇవ్వాల్సిన అత్యంత ప్రాధాన్యతను గుర్తిస్తూ, పరిశ్రమల స్థాపనలో వున్న అన్ని రకాల అడ్డంకులనూ తొలగిస్తూ ఆరంభ సంస్థలకు వరాల వర్షం కురిపించారాయన. పరిశ్రమలకు అడుగడుగునా చికాకు కలిగించే లైసెన్స్‌రాజ్ వ్యవస్థను ఇక అడ్డం రాకుండా చూస్తామనే భరోసా కూడా ఇచ్చారు. నియంత్రణ సంస్థలతో ఇబ్బంది లేకుండా స్వీయ ధృవీకరణ విధానానికి దారులు తీస్తామన్నారు. పన్ను మినహాయింపులు, ఇతరత్రా రాయితీలు, ప్రత్యేక యాప్ సౌకర్యం వగైరాలన్నీ త్వరగానే వచ్చేస్తాయని, ఇక పారిశ్రామికవేత్తలదే ఆలస్యమన్నట్లుగా ఆయన మంచి ఉత్తేజాన్నిచ్చారు. కేవలం మాటలతోనే కాక, చేతల ద్వారా రెండు చేతులా అభివృద్ధికి ప్రోత్సాహమిస్తూ స్టార్టప్ పరిశ్రమలకు మద్దతుగా అక్షరాల పదివేల కోట్ల రూపాయలతో ప్రభుత్వ నిధిని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంకుర పరిశ్రమలకు మూడేళ్ళపాటు ఆదాయపు పన్ను మినహాయింపు, మూలధన లాభాలపై పన్ను మినహాయింపులివ్వడం, 2వేల కోట్లతో రుణ హామీ నిధులు సమకూర్చడం, నిబంధనలు సడలించడం, కొన్ని అంశాల్లో స్వీయ ధృవీకరణలకు సరేననడం, వ్యాపార కార్యకలాపాల్లో అతితక్కువగా ప్రభుత్వ ప్రమేయం వుంటుందనడం, కొత్త పరిశ్రమలకు సరికొత్త సదుపాయాలు కల్పించడం, మహిళా వ్యాపారవేత్తలకు ప్రత్యేక పథకాలను రూపకల్పన చేయడంతోపాటు, అంకుర పరిశ్రమలు ప్రారంభించాక మూడేళ్ళపాటు వాటిపై ఎలాంటి తనిఖీలు వుండవనే భరోసా ఇవ్వడం..మొత్తం అంకుర పరిశ్రమల వ్యవస్థకు సంబంధించి ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపేందుకు వీలుగా ఏకగవాక్ష కేంద్రం ఏర్పాటుతో పాటుగా, ఒకే ఒక్కరోజులోనే సంస్థను నమోదు చేసేకునే ఏర్పాటు చేస్తామనడం.. ఇవన్నీ అంకురభారత్ కార్యాచరణలో దారిదీపాలుగా వుండి యువతకు, యువపారిశ్రామికవేత్తలకు వెలుగులదారి చూపిస్తాయనడంలో సందేహం లేదు. ఇవన్నీ కూడా ప్రధాని మోదీ ఆలోచనలకు రూపకల్పనలేనన్నది అందరికీ తెలిసిందే.

ప్రస్తుతం దేశంలో వున్న సుమారు 4,200 అంకుర పరిశ్రమలు వచ్చే పదేళ్ళలో దాదాపు లక్ష పరిశ్రమలుగా విస్తరించి, లక్షలాదికోట్ల వ్యాపారాభివృద్ధితో కళకళలాడేందుకు, వీటిద్వారా సుమారు మరో 35 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తీసుకున్న 'అంకుర భారత్' నిర్ణయాలు ఆచరణలో సత్ఫలితాలనిచ్చి భవిష్యత్‌లో దేశపురోభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తాయని ఆశించవచ్చు. అయినా, చిత్తశుద్ధి కలిగిన నాయకత్వం వుండాలేగానీ సాధించలేనిదేమీ వుండదు. దేశం ఆర్థికపరమైన ఇబ్బందులను అధిగమించి ప్రగతి రథచక్రాలు పరుగు అందుకున్నప్పుడే దేశానికి నిజమైన అభివృద్ధి. అందుకు పరిశ్రమల అభివృద్ధే మంచి మార్గం. ఈ సూక్ష్మాన్ని గ్రహించిన మోడీ..అంకురభారత్‌తో భారత్ నేల నాలుగు చెరగులా విస్తారంగా పారిశ్రామిక అంకురాలు నాటబోతున్నారు. భవిష్యత్తులో ఈ అంకురాలే మొలకలై.. మానులై, మహావృక్షాలై దేశప్రజలకు చల్లటి నీడనిస్తాయని, దేశమంతటా ప్రగతి గాలులు వీస్తాయని ఎంతైనా ఆశించవచ్చు. ''యువత అంటే ఉద్యోగాలు అడిగే వారిగా కాకుండా, ఉద్యోగాలు ఇచ్చేవారిగా ఎదగాలి''..అని ప్రధాని మోడీ ఆకాంక్షించడం, ఆ మేరకు కేంద్రప్రభుత్వం తరఫున తగ్గ అవకాశాలను యువత ముందు, యువ పారిశ్రామికవేత్తల ముందు కుప్పలుగా పోయడం ఆయనకు యువతరం అభివృద్ధి పట్ల వున్న చిత్తశుద్ధికి..యువతరానికి కొత్త ఊపునూ..ఉత్తేజాన్నివ్వాలనే సంకల్పానికి గట్టి నిదర్శనమనే చెప్పవచ్చు. 'అంకుర భారత్' వంటి బృహత్తర పథకాలను అందరితో పాటు, మారుమూల గ్రామీణులు సైతం అందిపుచ్చుకుని మంచి పారిశ్రామికవేత్తలుగా రాణించాల్సివుంది. 'అంకుర భారత్'తో పారిశ్రామిక అభివృద్ధితో... భారతావని నవనవోన్మేషం కావాల్సివుంది.


## పినాకినికి దేహ సమర్పణ

నెల్లూరుజిల్లా టిపిగూడూరు మండలం పోట్లపూడి గ్రామ వాస్తవ్యులు అదపాల బుజ్జమ్మ(88) సోమవారం మరణించారు. ఆమె కుమారుడు రవీంద్రనాథ్‌రెడ్డి తల్లిని శ్మశానానికి గాక, వైద్య విద్యా బోధకు రాలిగా పంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయాన్ని పినాకిని బాడీడోనార్స్ ఆర్గనైజేషన్ వారికి తెలియజేశాడు. దీంతో పినాకిని ముందుగా మాదరన్ కంటి వైద్యశాలతో సంప్రదించి ఆమె కళ్ళను స్వీకరింపజేసి అనంతరం బుజ్జమ్మ పార్థీవ దేహాన్ని నారాయణ ఆసుపత్రి వారికి అందజేశారు. ఈ సందర్భంగా పినాకిని బాడీ డోనార్స్ ఆర్గనైజేషన్ ఆర్గనైజర్ తిక్కవరపు సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరుజిల్లా గ్రామీణ ప్రాంతాల్లో తొలి దేహ సమర్పణ గత సంవత్సరం నెల్లూరు రూరల్ మండలం మాదరాజుగూడూరు నుంచి జరగ్గా ఇది రెండవదని, ఇప్పటి వరకు పినాకిని నిర్వహించిన 12వ దేహ సమర్పణ అని తెలిపారు.


## అద్దేపల్లికి నివాళి

ప్రముఖ సాహితీవేత్త, విమర్శకుడు డా॥ అద్దేపల్లి రామ్మోహనరావు తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేసారని పలువురు కవులు, రచయితలు పేర్కొన్నారు. సోమవారం అద్దేపల్లి మృతికి సంతాపంగా నెల్లూరు రచయితల సంఘం ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలోని వర్ధమాన సమాజంలో సంతాప సభ జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నెరసం ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎ.జయప్రకాష్, ప్రకాశంజిల్లా రచయితల సమాఖ్య అధ్యక్షుడు నూనె అంకమరావు, డాక్టర్ సోమిరెడ్డి జయప్రద, యు.వి.రావు, మాటేటి రత్నప్రసాద్, బి.వి.నరసింహం, గుర్రాల రమణయ్య, ఆలూరి శిరోమణిశర్మ, జి.సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర వేడుకలకు సన్నాహాలు



ఈ నెల 26న జరుగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలను జయప్రదంగా నిర్వహించాలని ఈ నెల 18న జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి అధికారులను ఆదేశించారు. ఆయా ఏర్పాట్లకు సంబంధించి అధికారులతో చర్చించారు. పోలీస్ పెరేడ్‌గ్రౌండ్‌లో జాతీయ పతాకావిష్కరణకు, కవాతు నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని, గ్రౌండ్‌లో మంచినీటి వసతి కల్పించాలన్నారు. ఆ రోజు సాయంత్రం కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగే సాంస్కృతిక ప్రదర్శనలకు నిర్ణీత సమయం కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో జేసి ఇంతియాజ్, ఏజేసీ రాజ్ కుమార్, డ్వామా పి.డి రామచంద్రారెడ్డి, జడ్పీ సిఇఓ బి. రామిరెడ్డి, డిఇఓ ఆంజనేయులు, డిఎంఅండ్‌హెచ్ఓ వరసుందరం, ఐసిడిఎస్ పి.డి పద్మావతి, మత్స్యశాఖ జేడీ సీతారామరాజు, ఉద్యానశాఖ ఏ.డి రవీంద్రబాబు, వ్యవసాయశాఖ డి.డి మురళీ తదితరులు పాల్గొన్నారు.




## భిక్షగాళ్లకో పథకం

యాచక వృత్తి నిర్మూలనకు కేంద్రం ఆలోచన చేయడం అభినందనీయం. యాచకవృత్తి సామాజిక బలహీనత. మనిషిని పురుగుకన్నా హీనంగా చూసే ప్రక్రియ. కొంతమంది పనిచేసే శక్తి వున్నా సోమరితనానికి అలవాటు పడి భిక్షగాళ్లుగా మారుతున్నారు. ఇలాంటి వారందరికీ ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేసి వారందరి చేత పనులు చేయించాలి. పనిని బట్టి ఆహారం, వేతనం కల్పించాలి. ప్రార్థనా మందిరాలు, రోడ్ల మీద యాచకులను లేకుండా చేయాలి. అలా చేస్తే సామాజికంగా వారికి కూడా గౌరవప్రదమైన స్థానం కల్పించినట్లవుతుంది.

**జి.వాసు, మైపాడు.**

## ప్రైవేట్ దోపిడీ

సంక్రాంతి సీజన్‌లో ప్రైవేట్ బస్సులు ప్రయాణీకులను నిలువునా దోచుకున్నాయి. హైదరాబాద్‌కు వోల్వో బస్సుల్లో 2500 రూపాయలు ఛార్జీలు వసూలు చేసారు. దీనిమీద నియంత్రణ లేదు. ప్రైవేట్ ట్రావెల్స్ వద్ద లంచాలు తీసుకుని అధికారులు ఈ దోపిడీని అడ్డుకోలేకున్నారు. ఇవి బ్లాక్‌లో కూడా అమ్మడం లేదు. ఆన్‌లైన్‌లో రేట్లు చూపించి అమ్ముతున్నారు.

**కీరపురెడ్డి వాణి, నెల్లూరు.**

## స్టార్టప్ ఇండియా భేష్

ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన 'స్టార్టప్ ఇండియా' ప్యాకేజీ ప్రభావవంతంగా వుంది. సబ్సిడీ పథకాలు, సంక్షేమ పథకాల సంస్కృతి విడనాడాలి. ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించే స్టార్టప్ ఇండియా లాంటి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలి.

**కె.జ్యోతి, నెల్లూరు.**

## కళా విహీనంగా పల్లెలు

సాఫ్ట్‌వేర్ సంస్కృతి మాయలో పల్లెలు కళా విహీనంగా మారుతున్నాయి. సంక్రాంతికి కళకళలాడుతుండాల్సిన గ్రామసీమలలో ఆ సందడి కనిపించడం లేదు. గంగిరెద్దులు, హరిదాసులు కనుమరుగయ్యారు. మన సాంప్రదాయాలన్నీ కనుమరుగైనట్లుగా ఈ సంక్రాంతి పండుగను చూస్తే అర్థమయ్యింది.

**పైడాల సతీష్‌రెడ్డి, ఆత్మకూరు.**

# వర్గపోరుకు తెరలేచింది

## అనుచరులను వద్దన్నారు... అధినేతలు వెళ్లారు!

*గతంలో కాంగ్రెస్‌పార్టీలో ఉన్నన్ని వర్గ రాజకీయాలు తెలుగుదేశంలో ఉండేవి కావు. కారణం ఇది ప్రాంతీయ పార్టీ కావడమే. ప్రాంతీయ పార్టీలో అధ్యక్షుడు నియంత ధోరణిలో ఉంటాడు కాబట్టి గ్రూపు రాజకీయాలు పెద్దగా చేయడం కుదరదు. ఇంతకాలం జిల్లా తెలుగుదేశం పార్టీలో వర్గ రాజకీయాలున్నా అవేమంత చెప్పుకోదగినవి కాదు. ఇప్పుడు తెలుగుదేశం పార్టీలో ఆనం సోదరులు చేరాక స్వతహాగానే పార్టీలో వర్గ రాజకీయాలు మొగ్గతొడుగుతున్నాయి. మొన్న విజయవాడ షోనే దీనికి వేదికగా మారింది.*

విజయవాడలో జరిగిన ఆనం బ్రదర్స్ షోలో జిల్లా తెలుగుదేశం నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బొల్లినేని రామారావు, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బీద రవిచంద్ర, గూటూరు కన్నబాబు వంటి నాయకులంతా పాల్గొన్నారు. అయితే వీళ్లంతా కూడా తమ అనుచరులకు ఎట్టి పరిస్థితుల్లోనూ విజయవాడ రావొద్దని హుకుం జారీచేశారు. వాళ్లు ఆ విధంగా చెప్పిన దానికి కారణం ఒక్కటే! మీరు ఆల్‌రెడీ తెలుగుదేశంలోనే ఉన్నప్పుడు మళ్ళీ ఆనం వాళ్లతో కలిసి తెలుగుదేశంలో చేరడం ఏంటని. వీళ్లు చెప్పింది కూడా రీజనే! ఆనం వాళ్ళు ఈసారి సగంకుపైగా నియోజక వర్గాలలో కలబెట్టారు. నెల్లూరు నగరం, రూరల్, ఆత్మకూరుల నుండే కాకుండా సర్వేపల్లి, కోవూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాల నుండి కూడా కార్యకర్తలను సమీకరించారు. అయితే ఈ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, లేదా ఇన్‌ఛార్జ్‌లు తమ అనుచరులను విజయవాడ వెళ్లకుండా కట్టడి చేయాలని చూసారు. కొందరు ఆగారు, మరికొందరు మాత్రం వారి వెంట వెళ్లారు. ఆయా నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలు లేదా ఇన్‌ఛార్జ్‌ల పట్ల అసంతృప్తితో ఉన్న వాళ్లకు ఇప్పుడు ఆనం నాయకత్వం ఆసరాగా దొరికింది. నెల్లూరు రూరల్‌లో ఆదాలపై అసంతృప్తితో వున్న కొద్దిమంది ఇప్పుడు ఆనం వెంట వెళ్లారు. కోవూరులో పోలంరెడ్డి అంటే పడని వ్యతిరేకులు ఆనం బాట పట్టారు. ఉదయగిరిలోనూ ఇదే జరిగింది. బొల్లినేని రామారావు పట్ల అసంతృప్తితో వున్న ఓ వర్గమంతా కూడా ఆనం నాయకత్వానికి జైకొట్టింది. ఇక ఆనంకు పట్టున్న ఆత్మకూరు నియోజకవర్గం నుండే భారీ జన సమీకరణ జరిగింది. సర్వేపల్లి నియోజకవర్గంలోని పొలకూరు, మనుబోలు, వెంకటాచలం మండలాలలో ఆనంకు పాతకాలం నుండే అనుచరు లున్నారు. కాబట్టి ఇక్కడ నుండి కూడా బాగానే వెళ్లారు.

దీనినిబట్టి చూస్తే ప్రతి నియోజక వర్గంలోనూ ఎమ్మెల్యే లేదా ఇన్‌ఛార్జ్‌కు పక్కనే 'ఆనం' అనే ఒక మేకును పెట్టినట్లయ్యింది. వీళ్ల కదలికలను బట్టి అది అప్పుడప్పుడు గుచ్చుకోక తప్పదు. విజయవాడలో షో అయితే ముగిసిందిగాని, జిల్లాలో ఆనం వారి రాజకీయ నటనా కౌశల్యం చూసి తరించే అసలు సినిమా ఇప్పుడే మొదలైంది.

## కిలారి ఇంట్లో చిల్లర

ఆనం బ్రదర్స్ విజయవాడలో షో పెట్టిన రోజే నెల్లూరు రూరల్ తెలుగుదేశం కన్వీనర్ కిలారి వెంకటస్వామినాయుడు తన ఇంటికి సినీ నిర్మాత చిల్లర కళ్యాణ్‌ను పిలిచి గెట్ టు గెదర్ పెట్టారు. సరిగ్గా కొన్ని నెలల క్రితమే రాంగనర్‌లో ఓ స్థలం వివాదమై వివేకాను ఈ చిల్లర కల్యాణ్ చెడామడా తిట్టి ఉన్నాడు. ఆ కల్యాణ్‌ను కిలారి ఇంటికి పిలిచి విందు ఇవ్వగా, దానికి ఆనం అంటే పడని మరో తెలుగుదేశం నాయకుడు, నగర కన్వీనర్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కూడా హాజరయ్యాడు. ఇక కిలారి పిలిచాడని చెప్పి మర్యాదపూర్వకంగా అనూరాధ, డాక్టర్ జడ్.శివప్రసాద్, అంచూరు జానకి, మేకల రామ్మూర్తి, పిట్టి సత్యనాగేశ్వరరావు, ఉచ్చి భువనేశ్వర ప్రసాద్, బొల్లినేని శ్రీవిద్య, రాజానాయుడు, నెల్లూరు సునీత, నూనె మల్లిఖార్జునయాదవ్‌లు హాజరయ్యారు.

# జిల్లాలో తెలుగు కాంగ్రెస్

***రాజకీయాలు చిత్రవిచిత్రంగా ఉంటాయి. అంతే చిత్రంగా మార్పు చెందుతుంటాయి కూడా! జిల్లాలో తెలుగుదేశంపార్టీని చూస్తే... ఇది స్వచ్ఛమైన తెలుగుదేశంపార్టీ అని ఎవరూ చెప్పలేరు. ఎందుకంటే ఇప్పుడిది తెలుగు కాంగ్రెస్‌పార్టీగా మారింది. జిల్లా తెలుగుదేశంపార్టీలో ఇప్పుడున్న నాయకుల్లో అత్యధిక శాతం మంది కాంగ్రెస్‌పార్టీ నుండి వచ్చినవాళ్ళే!***








1983 నాటి పార్టీ ఆవిర్భావ కాలం నిఖార్సయిన నాయకులు వేళ్ల మీద లెక్కపెట్టగలిగినంతమంది కూడా లేరు. తాళ్లపాక రమేష్‌రెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డి, బల్లి దుర్గాప్రసాద్, సాయికృష్ణ యాచేంద్ర లాంటి వాళ్లు మాత్రమే కనిపిస్తారు. ఆ తర్వాత కొంత సీనియార్టీ వుండేది కంభం విజయరామిరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పరసా రత్నం, బీద రవిచంద్ర, మస్తాన్‌రావు, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు లాంటి వారికే!

2014ఎన్నికలప్పటి నుండి పార్టీ పరిస్థితి చూద్దాం. కాంగ్రెస్ నుండి వలస వచ్చిన వాళ్లే పార్టీని ఆక్రమించేసారు. నెల్లూరు పార్లమెంటు మరియు రూరల్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు నగర ఇన్‌ఛార్జ్‌గా వున్న ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి కూడా అక్కడనుండీ వచ్చారు. ఇక మాగుంట శ్రీనివాసులురెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వచ్చింది కాంగ్రెస్‌పార్టీ నుండే! ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డిలు కూడా కాంగ్రెస్ నుండి ఇక్కడ చేరినవాళ్లే! ప్రస్తుతం ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు తమ అనుచరులతో బలంగా తెలుగుదేశంపార్టీలో చేరారు. వీరి చేరికతో జిల్లాలో అసలు తెలుగుదేశం నాయకుల కంటే కూడా తెలుగు కాంగ్రెస్ నాయకులదే పైచేయి అన్నట్లుగా పరిస్థితులు మారిపోయాయి.

## నివాళి



**మన్నెం కృష్ణమోహన్‌రెడ్డి**

జననం : 07.09.1956 | మరణం : 16.01.2016

*నేస్తమా...*

**స్నేహమేగా జీవితం... స్నేహమేగా శాశ్వతం**

నీ స్మృతిలో... ప్రియమిత్రులు

నెల్లూరు కబుర్లు

# ఆక్రమణలపై కొరడా!

నెల్లూరు నగరంలో రైల్వే స్థలాల ఆక్రమణల తొలగింపుకు జిల్లా కలెక్టర్ ఎం.జానకి శ్రీకారం చుట్టారు. నగరంలో రంగనాయకులపేట గేటు నుండి అయ్యప్పగుడి వరకు పెద్దఎత్తున రైల్వే స్థలాలు ఆక్రమణలకు గురైవున్నాయి. బి.వి.నగర్ వంటి చోట్ల రైల్వే స్థలాలలో పెద్ద బిల్డింగ్‌లే కట్టి వున్నారు. వీటన్నింటిని తీసేయాలని కలెక్టర్ రైల్వే, రెవెన్యూ అధికారులకు చాలా గట్టిగా చెప్పారు. త్వరలో రైల్వేట్రాక్‌లను పెంచుతున్న దృష్ట్యా రైల్వే ఆక్రమణలపై అధికారులు కొరడా ఎత్తారు.



# శుభమస్తు లక్కీ డ్రా

నెల్లూరు వి.ఆర్.సి సెంటర్‌లోని శుభమస్తు షాపింగ్‌మాల్‌లో క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని ఖాతాదారులకు ప్రత్యేకఆఫర్లు ఇవ్వడంతో పాటు లక్కీడ్రాలు కూడా నిర్వహించారు. 18వ తేదీన 6వ బంపర్ డ్రాను మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి చేతుల మీదుగా నిర్వహించారు. వివేకా చేతి అదృష్టం ఏఎస్‌పేట మండలం హసనాపురంకు చెందిన డి.వి.శేషయ్యకు కలిసొచ్చింది. లక్కీడ్రాలో ఆయన విజేతగా నిలిచి నానోకారును కొట్టేసారు. అలాగే రోజుకో పట్టుచీర లక్కీ డ్రాను మాజీమేయర్ ఎన్.భానుశ్రీ చేతుల మీదుగా నిర్వహించగా నెల్లూరుకు చెందిన షేక్ ఖలీల్ విజేతగా నిలిచారు. ఈ కార్యక్రమంలో షాపింగ్‌మాల్ అధినేతలు బయ్యా వాసు, రవిలు కూడా పాల్గొన్నారు.

# నెల్లూరులో జబర్దస్ టీం సందడి



నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లోని ఫ్యాషన్ స్టైల్ వస్త్ర దుకాణంలో ఈ నెల 16వ తేదీ జబర్దస్త్ టీం అప్పారావు, చిట్టిబాబు, చిత్రం శీను తదితరులు సందడి చేశారు. కామెడీషోలో పాల్గొనేందుకు వస్త్ర కొనుగోలు నిమిత్తం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.ఆర్.సి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి, రామసుబ్బారెడ్డి, రూడ్స్ స్వచ్ఛంధ సేవాసంస్థ అధ్యక్షులు రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ ఎన్నికలు

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు శాఖ ఎన్నికలను ఈ నెల 29న నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఛైర్మెన్ శ్రీమతి యం.జానకి పచ్చ జెండా ఊపారు. నెల్లూరుశాఖకు అనుబంధంగా వున్న నెల్లూరు, విడవలూరు, కావలి, ఉదయగిరి, ఆత్మకూరు, గూడూరు, సూళ్లూరుపేట బ్రాంచ్‌ల నుండి 10మంది సభ్యుల ఎన్నికకు ఈ ఎన్నికలు జరుగుతాయి. జిల్లా సహకార అధికారి రాజేశ్వరరావును ఎన్నికల అధికారిగా నియమించారు. మొత్తం 1086మంది సభ్యులతో ఓటర్ల జాబితా రెడీ చేశారు. ఈ నెల 22 నుండే ఎన్నికల ప్రక్రియ మొదలైంది. 29న ఎన్నికలు రసవత్తరంగా ఉండబోతున్నాయి.

## మిధున్‌రెడ్డి ములాఖత్‌కు తంటాలు

తిరుపతి ఎయిర్‌పోర్ట్ మేనేజర్‌పై దాడి కేసులో రాజంపేట ఎంపి మిధున్‌రెడ్డి నెల్లూరు జైలులో ఉన్నారు. ఆయనను కలవడానికి ప్రతిరోజూ ప్రముఖులు చాలామందే వస్తున్నారు. అయితే జైలు నిబంధనల ప్రకారం అందరూ ఆయనను కలవలేకపోతున్నారు. కొందరైతే జైలు ఉన్నతాధికారులకు సిఫార్సులు చేయిస్తూ ఎంపీని కలిసే ప్రయత్నాలు చేస్తున్నారు.

## ఉద్యోగి నిజాయితీ

రోడ్డు మీద పది రూపాయల నోటు దొరికితేనే ఎవరికీ కనిపించకుండా జేబులో పెట్టుకుపోయే రకాలున్న ఈ రోజుల్లో ఓ ఉద్యోగిని తనకు దొరికిన 6గ్రాముల ఆభరణాన్ని పోలీసులకు అప్పగించి తన నిజాయితీని చాటుకుంది. వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న సువర్ణకుమారి ఈ నెల 17న నెల్లూరు, వైఎంసిఏ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్‌కు వెళ్లగా ఆమెకు 6గ్రాముల బంగారు పాపటిబిళ్ళ దొరికింది. ఆమె అక్కడ విచారించినా పోగొట్టుకున్న వాళ్లు దొరకకపోవడంతో ఆ పాపటిబిళ్ళను నాల్గవనగర పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి ఆదర్శప్రాయంగా నిలిచింది.

## కార్పొరేషన్‌కొచ్చిన ఢిల్లీ పిల్లలు

ఢిల్లీకి చెందిన 21మంది స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కోర్సు విద్యార్థులు 18వ తేదీ నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చారు. కమిషనర్ పివివిఎస్ మూర్తితోనూ, టౌన్‌ప్లానింగ్ అధికారులతోనూ సమావేశమయ్యారు. బిల్డింగ్ ప్లాన్‌లు, మాస్టర్‌ప్లాన్‌లపై అధికారులతో చర్చించి అవగాహన తెచ్చుకున్నారు. వీళ్లు ఈ నెలాఖరు దాకా ఇక్కడే వుంటారు. పనిలోపనిగా వీళ్లు ముదురుదోమల గురించి కూడా ఈలోపే తెలుసుకోవచ్చు.

# హోంగార్డ్స్ క్యాలెండర్



నెల్లూరులోని హోంగార్డ్స్ యూనిట్ రూపొందించిన 2016 సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా ఎస్పీ గజరావు భూపాల్ సోమవారం పోలీస్‌గ్రౌండ్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆవిష్కరించారు. క్యాలెండర్ డిజైన్‌ను ఎస్పీ మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రెడ్డి గంగాధర్, హోంగార్డ్ డిఎస్పీ కె.శ్రీనివాసరావు, ఎస్.బి డిఎస్పీ కోటారెడ్డి, సిసిఎస్ డిఎస్పీ శ్రీధర్, మహిళా డిఎస్పీ శ్రీనివాసాచారి, ఎస్ఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

# గీతామయిలో వస్త్రదానం



ఎన్టీఆర్ 20వ వర్ధంతిని పురస్కరించుకుని నారా లోకేష్ సేవాసమితి అధ్యక్షులు పాశం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలో సోమవారం వృద్ధులకు వస్త్రదానం, అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టిడిపి నెల్లూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టిడిపి నెల్లూరు రూరల్ కన్వీనర్ కిలారి వెంకటస్వామినాయుడు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు పాముల రమణయ్య తదితరులు పాల్గొని వృద్ధులకు వస్త్రదానం, అన్నదానం చేశారు.

# స్నేహితుని కుటుంబానికి చేయూత

**- సిఎంఎం పూర్వ విద్యార్థుల ఆత్మీయత**

సుమారు ముప్పై ఏళ్ళ క్రితం తమతో కలసి చదువుకున్న స్నేహితుడు ప్రమాదంలో మరణించడంతో, అతని కుటుంబాన్ని ఆదుకునేందుకు స్నేహితులంతా ఒకటయ్యారు. ఎంతో ఇబ్బందుల్లో వున్న ఆ మిత్రుని కుటుంబాన్ని ఆదుకుని స్నేహితునిపై వున్న అభిమానాన్ని ఆత్మీయతను చాటుకున్నారు.

నెల్లూరు సిఎంఎం హైస్కూల్‌లో 1985లో చదువుకున్న ఆ విద్యార్థులు తమ సహ విద్యార్థి మురళీధర్ కారు ప్రమాదంలో చనిపోవడంతో, ఆయన పిల్లల భవిత కోసం ఆ కుటుంబానికి మిత్రులంతా కలసి లక్ష రూపాయల సాయం అందించారు. ఆ మొత్తాన్ని మురళీధర్ పిల్లల పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ వేసి ఈ నెల 17న ఆ పత్రాలను పిల్లలకు అందజేశారు. అలా చేయడం వల్ల మిత్రులందరికీ ఎంతో సంతృప్తిగా వుందని మురళీ మిత్రుడు, సిఎంఎం పూర్వవిద్యార్థి మహ్మద్ రఫీ అన్నారు. ఈ కార్యక్రమంలో రత్నకుమార్, షరీఫ్, రామారావు, రఘునాధరెడ్డి పాల్గొన్నారు.

# పేదరాజులను పట్టించుకోండి

**బిసి సంక్షేమ సంఘం రాష్ట్రనేతకు వినతి**



ఆర్యక్షత్రియ కులస్తుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని సీమాంధ్ర బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్యకు ఆర్యక్షత్రియ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు నందిగం చంద్రశేఖరవర్మ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 17న నెల్లూరు నగరంలోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్యక్షత్రియ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు విన్నవించారు. ఆర్యక్షత్రియులు కుల ధృవీకరణ పత్రాల కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా ఆర్యక్షత్రియుల అభ్యున్నతి కోసం బిసి కార్పొరేషన్ ద్వారా ఇస్తామన్న స్వయం ఉపాధి రుణాలు కూడా అందరికీ సక్రమంగా అందడం లేదని, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఆర్యక్షత్రియులు వెనుకబడి వున్నారని, ఇకనైనా ఆర్యక్షత్రియుల సమస్యలు పరిష్కరించేందుకు పటిష్టమైన కృషి చేయాలని కోరారు. అందుకు స్పందించిన సీమాంధ్ర బిసి సంక్షేమసంఘం నేత శంకరయ్య మాట్లాడుతూ, ఆర్యక్షత్రియుల అభ్యున్నతి కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా తమవంతు కృషి చేస్తామన్నారు. తొలుత, శంకరయ్యకు ఆర్యక్షత్రియ సంఘం ప్రతినిధులు పుష్పగుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో నాయకులు పైకోటి రామమూర్తి, గుండా శ్రీనివాసులు, శ్రీనివాసులవర్మ, ఉమా శ్యామ్‌ప్రసాద్, వెంకటేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

# ఆదుకోండంటున్న వృద్ధ దంపతులు

నిలువ నీడ లేక, నా అనేవారు లేక అనారోగ్యంతో బాధపడుతున్న తమను దయగల మారాజులు ఆదుకోవాలని వేడుకుంటున్నారు వృద్ధ దంపతులు. గండికోట రామకృష్ణ, మంగళగౌరి అనే వృద్ధ దంపతులు సోమవారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం పెట్టారు. సొరియాసిస్ వ్యాధితో తాను బాధపడుతున్నానని, వయోభారంతో ఏ పనీ చేయలేకున్నానని, సొంతిల్లు గాని, రేషన్‌కార్డు గాని లేదని, తిరుపతి ఆయుర్వేద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానని, తనని ఆదుకోవాలనుకున్న దాతలు 7093113317 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. 111410100063440లో తమ విరాళం జమ చేయవచ్చని తెలిపారు.

# ఆర్టీసీని కొల్లగొడుతున్నారు

## - రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజం



రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని సర్వనాశనం చేస్తోందని కమలాపురం ఎమ్మెల్యే, వైయస్సార్ కాంగ్రెస్ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. ఈ నెల 18న నెల్లూరులోని డి.ఆర్.ఉత్తమ హోటల్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. విభజన తర్వాత ఆర్టీసీ పరిస్థితి దారుణంగా మారింది. ఆర్టీసీ ఆస్తులు తెలంగాణకు, అప్పులు ఆంధ్రకు మిగిలాయి. మిగిలిన అరకొర ఆస్తులను కూడా చంద్రబాబు ప్రభుత్వం కాజేసే పనిలో వుంది. ఆర్టీసీ ఆస్తులను గతంలో 33ఏళ్ళు లీజుకిస్తే, చంద్రబాబు దానిని 99ఏళ్లకు పెంచుతూ జీఓ జారీ చేశారు. ఆర్టీసీ ఆస్తులను తాకట్టు పెట్టి కార్మికులకు జీతాలిస్తున్నారు. చంద్రబాబు గతంలో సీఎంగా పనిచేసినప్పుడు ఆర్టీసీ 850కోట్ల నష్టాల్లో కూరుకుపోయింది. దివంగత నేత వై.యస్. హయాంలో 850కోట్లు అరియర్స్‌ను చెల్లించి ఆర్టీసీకి ఊపిరిపోశారు. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు ఆర్టీసీ ఊపిరి తీస్తున్నాడు. రాజధాని శంకుస్థాపనకు వాడుకున్న బస్సులకు డబ్బులు కట్టలేదు. ప్రైవేట్ బస్సులను కట్టడి చేయడం లేదు. ఆర్టీసీలో 2200 అద్దె బస్సులు తిప్పుతున్నారు. ఇటీవల 900 అద్దెబస్సులకు టెండర్లు పెట్టారు. ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేస్తున్నా పలు కార్మిక సంఘాలు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నాయి. కార్మికుల చేత 16గంటలు పని చేయిస్తున్నారు. ఆర్టీసీని కాపాడుకోకపోతే లక్షలాది మంది కార్మికుల భవిష్యత్ రోడ్డున పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ బి.రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, కిలివేటి సంజీవయ్య, పాశం సునీల్‌కుమార్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# శ్రీసిటీలో బంగ్లా బృందం

బంగ్లాదేశ్‌లో సెజ్‌ల ఏర్పాటుపై అధ్యయనం చేసేందుకుగాను బంగ్లాదేశ్ ఎకనామిక్ జోన్స్ అథారిటీకి చెందిన 8మంది ఉన్నతస్థాయి అధికారుల బృందం ఈ నెల 19వ తేదీన ప్రతిష్ఠాత్మకమైన తడ సమీపంలోని శ్రీసిటీ సెజ్‌ను సందర్శించింది. ఎస్ఎం షాకత్ ఆలీ ఆధ్వర్యంలో వచ్చిన ఈ బృందానికి శ్రీసిటీ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ సతీష్ కామత్ స్వాగతం పలికారు. గతేడాది జూన్‌లో భారత ప్రధాని నరేంద్రమోడీ బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లినప్పుడు మన దేశ ఆర్థిక సాయంతో మన దేశ వ్యాపార సంస్థల సహకారంతో ఆ దేశంలో రెండు సెజ్‌ల ఏర్పాటుకు అంగీకారం కుదిరింది. ఈ సెజ్‌ల ఏర్పాటులో అధ్యయనం కోసం ఈ బృందం వచ్చి శ్రీసిటీ ప్రగతిని క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ బృందం రాక పట్ల శ్రీసిటీ యం.డి రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేస్తూ శ్రీసిటి అధ్యయనం బంగ్లాదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

# పురిటిబిడ్డలకు ప్రాణం పోశారు



ప్రాణాపాయస్థితిలో ఉండే పసిబిడ్డలకు అత్యాధునిక వైద్యసేవలు అందిస్తూ, బిడ్డల ప్రాణాలను సంరక్షిస్తూ గత కొన్నేళ్ళుగా నెల్లూరు పొగతోటలో ఉండే రవి చిన్నపిల్లల ఆసుపత్రి వైద్యుల బృందం ఎనలేని సేవలు అందిస్తుంది. ఈ క్రమంలోనే నిరుపేదలైన వెట్టి మునిరాజు, శుభలేఖ దంపతులకు ఒకే కాన్పులో నెలలు నిండకుండా అతితక్కువ బరువుతో పుట్టిన ముగ్గురు పిల్లలను ప్రాణాపాయస్థితి నుంచి కాపాడింది రిచ్ హాస్పిటల్. ఇటీవల రిచ్ హాస్పిటల్ అధినేత డా॥ రవికుమార్ దీనికి సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ... ఒక తల్లికి ఒక కాన్పులో ఒక బిడ్డ జన్మించడం సాధారణమని, అలా కాకుండా ఒకేలా ఇద్దరు లేదా ముగ్గురు జన్మించడం చాలా అరుదన్నారు. వెయ్యి కాన్పుల్లో ఒకరికి ఇలా జరుగుతుందన్నారు. అలాకాకుండా ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలు అది కూడా వేర్వేరు రూపాలలో విభిన్న జండర్‌లతో జన్మించడం మహా అరుదన్నారు. నెల్లూరుజిల్లా సూళ్లూరుపేటకు చెందిన నిరుపేదలు వెట్టి మునిరాజు, శుభలేఖ దంపతులకు నెల్లూరుజిల్లా గూడూరులోని అన్వేష్ హాస్పిటల్‌లో ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు 8వ నెలలో జన్మించడం జరిగిందన్నారు. ఒక బిడ్డ 1.4కేజీలు, రెండవ బిడ్డ 1.3కేజీలు, మూడవ బిడ్డ 1కేజీతో మెదడు, గుండె, ఊపిరితిత్తులు లాంటి ప్రధాన అవయాలు ఎదుగదల లేకుండా ప్రాణాపాయ స్థితిలో జన్మించడం జరిగిందన్నారు. మునిరాజు దంపతులు ఆ బిడ్డలను తమ రిచ్ హాస్పిటల్‌కు తీసుకురావడంతో ఎన్‌టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా ఉచితంగా అత్యున్నత వైద్యాన్ని అందించి బిడ్డలను కాపాడడం జరిగిందన్నారు డాక్టర్ రవికుమార్. ప్రస్తుతం బిడ్డలతో తల్లిదండ్రులు ఆనందంగా వున్నారు.

## ప్రేమజంటకు
# నగదు ప్రోత్సాహం



మతాంతర వివాహం చేసుకున్న పొదలకూరుకు చెందిన షేక్ షాకీర్, కావలికి చెందిన ఎన్.హరిత దంపతులకు ప్రోత్సాహక బహుమతి క్రింద 10వేల రూపాయల డి.డిని ఈ నెల 19వ తేదీ జిల్లా పరిషత్ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అందజేశారు. జడ్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీ సిఇఓ బి.రామిరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

# జూనియర్‌లు ఎటువైపో?





ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు రాజకీయ శూన్యత నుండి బయటపడి తెలుగుదేశంపార్టీలో చేరారు. ఇక నెంబర్ త్రీ, ఫోర్‌ల పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకంగా వుంది. ఆనం సోదరులలో మూడోవాడైన ఆనం జయకుమార్‌రెడ్డికి 2014ఎన్నికలకు ముందే తన సోదరుడు వివేకాతో పడకుండా వచ్చింది. ఆయన అన్నతో విభేదించి ఎన్నికల సమయంలో 'జై సమైక్యాంధ్ర' పార్టీలోనూ, ఎన్నికల తర్వాత తెలుగుదేశంలోనూ చేరడం జరిగింది. ఇప్పుడు ఆయనున్న పార్టీలోకే తన అన్న కూడా వచ్చాడు. పార్టీలో మొదటి ఇద్దరికీ వున్న ప్రాధాన్యత జయకు వుండదు. 'ఆనం' బ్రాండ్‌ను వాళ్లు ఎగరేసుకుపోతారు. ఈ సమయంలో జయ ముందున్న మార్గమేంటి? కాంప్రమైజయ్యి కామ్‌గా తెలుగుదేశంలోనే కొనసాగడమా? లేక మరో మార్గం చూసుకోవడమా? నాలుగో బ్రదర్ ఆనం విజయకుమార్‌రెడ్డి మొన్నటి వరకు తన అన్నలతోనే కలిసి నడిచాడు. అయితే తెలుగుదేశంలోకి మాత్రం ఆయన తన సోదరుల వెంట నడవలేదు. బహుశా తెలుగుదేశంలో చేరడానికి ఆయన అంతరాత్మ ఆమోదం తెలిపినట్లు లేదు. తెలుగుదేశంలో చేరేవాడే అయితే తన అన్నలవెంటే వెళ్లుండేవాడు. ఆయన ఆలోచనా ధోరణి భిన్నంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సిటీలో వినిపిస్తున్న టాక్ జయ, విజయలిద్దరు కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతారని. ఆనం జయ తెలుగుదేశంలో ఉండలేడు. విజయ కూడా కాంగ్రెస్‌లో కొనసాగలేడు. అట్లాగని రాజకీయాలను మానుకోలేరు కదా! వాళ్లు తమ సోదరుల్లాగానే ఏదో ఒక రాజకీయ మార్గం చూసుకోవాలి. త్వరలోనే జగన్‌తో చర్చించి వాళ్లిద్దరూ వైకాపా దారి పడతారని భోగట్టా!

# ఆర్టీసీ బస్టాండుకు మెరుగులు

నెల్లూరులోని ఏపిఎస్ ఆర్టీసీ ప్రధాన బస్టాండుకు నూతన శోభను చేకూర్చేందుకు శరవేగంగా పనులు జరుగుతున్నాయి. ప్రయాణీకులకు మెరుగైన వసతుల కల్పనకు దాదాపు రూ.66లక్షలతో పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా ప్రయాణీకులకు బస్సుల సమాచారం తెలిపేందుకు ఎల్ఇడి టీవీలు, కూర్చునేందుకు స్టీలు కుర్చీలు, కంప్యూటరైజ్డ్ బస్సుల సమాచారం, ప్రయాణీకులకు స్పష్టంగా వినిపించేలా ఆధునిక స్పీకర్లు ఏర్పాటు చేస్తున్నారు. బస్టాండు అందంగా ఉండేందుకు అల్యూమినియం ప్యానలింగ్, వాణిజ్య ప్రకటనలకు అవసరమైన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. బస్టాండు మొత్తాన్ని అందమైన పెయింటింగ్‌తో అలంకరిస్తున్నారు. ఆర్టీసీని అందరూ ఆదరించి పరిశుభ్రంగా ఉంచాలని నెల్లూరుజోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.వి.ప్రభాకర్‌రెడ్డి కోరారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ ఇప్పటి వరకు మూత్రశాలలు కేవలం మాత్రకంపుతో ప్రయాణీకులకు ఇబ్బంది కలిగిస్తుంది. బస్సులు ఆగే చోటే టాయ్‌లెట్లు వుండడం వల్ల ప్రయాణీకులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు ఆ గబ్బును భరించాల్సి వస్తుంది. ప్రయాణీకులకు ఈ కంపు నుండి కూడా విముక్తి కల్పించాల్సి వుంది.

# సూపర్ డాగ్ షో



నెల్లూరు విఆర్ కళాశాల మైదానంలో ఆదివారం నెల్లూరు కెన్నెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాగ్‌షో అదరగొట్టింది. వివిధ జాతులకు చెందిన కుక్కలు తమ అందచందాలతో ఆకట్టుకున్నాయి. 15జాతులకు చెందిన 100కుపైగా పెంపుడు కుక్కలను వాటి యజమానులు ప్రదర్శనకు తీసుకొచ్చారు. నిర్దేశించిన ప్రామాణికం ప్రకారం విజేతలను ప్రకటించారు. నెల్లూరుజిల్లా కోవూరుకు చెందిన శ్రీను పెంపుడు కుక్క డాబర్‌మన్ ఛాంపియన్‌గా నిలిచింది. నెల్లూరు గోల్డ్‌ఫీల్డ్స్ అధినేత పూజకు చెందిన డెగల్‌కు ద్వితీయ స్థానం, నెల్లూరు శెట్టిగుంటరోడ్డు రవితేజకు చెందిన పగ్‌కు తృతీయ స్థానం, కావలి ఇర్ఫాన్‌కు చెందిన డాబర్‌మెన్‌కు నాల్గవస్థానం, నెల్లూరు బాలాజీకి చెందిన గ్రేడల్‌కు అయిదవ స్థానం లభించాయి. నెల్లూరు జాకీర్ చెందిన స్పేక్‌కు ప్రోత్సాహక బహుమతి లభించింది. ఆయా కుక్కల యజమానులకు కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతగా సుభాకర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డిడి పెద్దస్వామి, ఏడిలు ప్రభాకర్ గుప్తా, రమేష్‌బాబు, జయచంద్ర, వెంకటస్వామిరెడ్డి, రమణయ్య, కెన్నెల్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణారెడ్డి, సురేంద్ర, ట్రెజరర్ ఐ.రాజా పాల్గొన్నారు.


# పోలియో చుక్కలతో ఆరోగ్యం



టవర్ క్లాక్ కూడలి వద్ద పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్

ప్రతి చిన్నారికి రెండు పోలియో చుక్కలు వేయడంతో జీవితాంతం ఆరోగ్య వంతులుగా ఉంటారని రాష్ట్ర ఆరోగ్యశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. గూడూరు పట్టణంలోని గడియారపు స్థంభం కూడలి వద్ద చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలను ఆదివారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ దారిద్రరేఖకు దిగువనున్న వలసవాసుల పిల్లలు తప్పిపోకుండా పోలియో చుక్కలు వేయాలని సూచించారు. డాక్టర్ సుధాకర్ పోలియో కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు. గూడూరు మండలంలో 91 శాతం నమోదైంది. మొత్తం 55కేంద్రాలు, ఒక మొబైల్ వాహనం ద్వారా మొత్తం 5,378మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు చెన్నూరు పిసిహెచ్‌సి వైద్యులు సునీల్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ గిరీషా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తదితరులు పాల్గొన్నారు.

# మాస్టర్ క్రికెట్ లీగ్



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

క్రికెట్ క్లబ్, కనుమూరు హరిచంద్రారెడ్డి క్రికెట్ క్లబ్ సంయుక్తంగా సంక్రాంతిని పురస్కరించుకుని నిర్వహించిన మాస్టర్ క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ చిన్నతనంలో కలసి ఆడుకుని ప్రస్తుతం ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లో వుంటున్న వారు సంక్రాంతి సందర్భంగా కలుసుకోవడం మాస్టర్ క్రికెట్ పోటీలతోనే సాధ్యమవుతుందన్నారు. గూడూరు నుంచి 6 జట్లు, కావలి, నెల్లూరు నుంచి ఒక్కో జట్టు పాల్గొని క్రికెట్ పోటీలో తలపడ్డాయి. మాస్టర్ లీగ్ మ్యాచ్‌లో నెల్లూరు నైట్‌రైడర్స్ జట్టు విజేతగా, సునీల్ సన్‌రైజర్స్ జట్టు రన్నర్స్‌గా విజయం సాధించాయి. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా పేటేటి గిరీష్‌కుమార్, బౌలర్‌గా రజనీకాంత్, కీపర్‌గా రంగా నిలిచారు. గెలిచిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ గిరీషా, దాత కె.హరిచంద్రారెడ్డి, శాప్‌డైరెక్టర్ రవీంద్రబాబు, కె.మునిగిరీష్, శ్రీనివాసులురెడ్డి, వి.శివకుమార్, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హోరాహోరీగా హాకీ పోటీలు

గూడూరు అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జరిగిన మనపాటి సురేంద్రబాబు మెమోరియల్ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా హాకీ టోర్నమెంటులో తూర్పుగోదావరి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో తూర్పుగోదావరి జట్టు అనంతపురం జట్లు తలపడగా 2-0 గోల్స్‌తో తూర్పుగోదావరి జిల్లా జట్టు విజయం సాధించింది. అనంతరం విజేతలకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన పాల్గొని మాట్లాడుతూ ఓటమి విజయానికి నాందిగా భావించాలన్నారు. రూరల్ సిఐ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ క్రీడలు అభివృద్ధి చెందేందుకు స్టేడియంలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మనపాటి రవీంద్రబాబు, నల్లపురెడ్డి జగన్మోహన్‌రెడ్డి, హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శేషయ్య, సూళ్లూరుపేట సిఐ విజయకృష్ణ, ఎస్‌ఐలు దశరథ రామారావు, అంకమ్మ, కౌన్సిలర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీని అందుకుంటున్న విజేత తూర్పుగోదావరి జట్టు

## వైభవంగా సంక్రాంతి




ముగ్గులను తీర్చిదిద్దుతున్న మహిళలు

గూడూరులో సంక్రాంతి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. మహిళలు ముగ్గులను తీర్చిదిద్దారు. చిన్నారులు గాలిపటాలను ఎగురవేశారు. శనివారం కనుమ సందర్భంగా పశువుల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గేదెలు, ఆవులు, ఎద్దులను వివిధ వేషధారణలలో అలంకరించారు. అట్టహాసంగా పొంగళ్లు పెట్టుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# నేత్రపర్వంగా కోదండరాముని తెప్పోత్సవం





కోదండ రామునికి కల్యాణం జరిపిస్తున్న హరిచంద్రారెడ్డి కుటుంబసభ్యులు

గూడూరు పట్టణం కోనేటి మిట్టలో శ్రీ కోదండరాముని కల్యాణం 16వ తేదీ రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. కనుమూరు హరిచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కనుమూరు హరిచంద్రారెడ్డి ఏటా నిర్వహించే ఈ వేడుకను మేళతాళాలు, బాణాసంచా మోతల మధ్య వైభవంగా చేపట్టారు. తొలుత శ్రీ కోదండ రాముని కల్యాణాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణలతో హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో చేశారు. కోనేరులో ప్రత్యేక పుష్పాలంకరణ చేసిన తెప్పపై శ్రీ కోదండరాముడు మూడుసార్లు విహరించారు. రంగురంగుల విద్యుద్దీపాల నడుమ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ గిరీషా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్, రూరల్ సిఐ శ్రీనివాసులురెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. దాదాపు గంటపాటు బాణాసంచా మోతలు దద్దరిల్లాయి. ఆకాశంలోకి ఎగిసిన ఇవి రంగురంగులను వెదజల్లాయి. పట్టణ పరిసరప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారి తెప్పోత్సవాన్ని తిలకించారు.

ఈ కార్యక్రమాన్ని కనుమూరు ట్రస్టు ప్రతినిధి కె.మునిగిరీష్ పర్యవేక్షించారు. పట్టణ ఎస్సైలు దశరథరామారావు, నరేష్, బాబి బందోబస్తు నిర్వహించారు.

# గంగమ్మ గుడిలో ప్రత్యేకపూజలు



గూడూరు గంగమ్మ గుడిలో టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర పుట్టినరోజు వేడుకలు ఇటీవల శ్రీ కృష్ణయాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మయూరి శ్యాంయాదవ్ ఆధ్వర్యంలో యాదవ సోదరులు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, కౌన్సిలర్లు పాలిబోయిన రమేష్, బిల్లు చెంచు రామయ్య, యాదవులు కట్టా సుధాకర్, బత్తిన హనుమంతరావు, బత్తిన సుధాకర్, పప్పుయాదవ్, చిల్లకూరు ఎంపిపి రమాదేవి, వైయస్సార్సీపీ నాయకులు పిట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఐ.డి.బి.ఐ. బ్యాంక్‌లో కాయిన్స్ మేళా



శ్రీకాళహస్తి పట్టణంలోని ఐ.డి.బి.ఐ. బ్యాంక్ నందు సోమవారం కాయిన్స్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ.డి.బి.ఐ. బ్యాంక్ మేనేజర్ ఎస్.విశాల్ మాట్లాడుతూ ఒక రూపాయి, రెండు రూపాయిలు, ఐదు రూపాయలు, పది రూపాయలు కాయిన్స్‌ను పురప్రజలకు, ఖాతాదారులకు పంపిణీ చేశారన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కాయిన్స్‌ను పంపిణీకి సిద్ధం చేయడంతో వ్యాపారస్తులందరూ సద్వినియోగం చేసుకున్నారన్నారు. ప్రతి ఒక్కరికి బ్యాకింగ్ వ్యవస్థపై అవగాహన కల్పించామన్నారు. సామాజిక సేవల్లో ముందంజలో ఉన్న బ్యాంకు సేవల్ని ఉపయోగించుకోవాలన్నారు. కాయిన్స్ మేళాలో మొత్తం రూ. 60,000/-లు ఖాతాదారులకు, పురప్రజలకు, వ్యాపారస్తులు బ్యాంక్‌కు వచ్చి తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎబిఎం వెంకటేశ్వర్లు, బ్యాంక్ సిబ్బంది గిరి, భాను, చంద్రయ్య, సోమశేఖర్, శ్రీధర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి న్యూస్

# మార్చి 2నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తిలో శివరాత్రి మహోత్సవాలు మార్చి 2, బుధవారం నుంచి ప్రారంభించాలని ప్రధాన అర్చకులు, అధికారులకు నిర్ణయించారు. 2వ తేదీన భక్తకన్నప్ప ధ్వజారోహణం, 3వ తేదీ గురువారం స్వామి వారి ధ్వజారోహణం, 7వ తేదీ సోమవారం తెల్లవారు జామున లింగోద్భవ దర్శనం, రాత్రి నందిసేవ, 8వ తేదీ మంగళవారం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 9వ తేదీ బుధవారం స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవం, 10వ తేదీ గురువారం సభాపతి కళ్యాణం, 11న కైలాసగిరి ప్రదక్షిణ, 12న వసంతోత్సవం, 13న ఆదివారం పల్లకిసేవ, 14వ తేదీ సోమవారం ఏకాంత సేవతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

# విజయవాడ సభలో చంద్రబాబును తిట్టిన వివేకా

అది స్వర్గలోకం రాజధాని అమరావతి. ఇంద్రుడు అప్పుడే సభా ప్రాంగణంలో ఆసీనుడయ్యాడు. అక్కడ స్వర్గలోక ప్రాప్తి పొందిన మానవులందరికీ అన్ని ఆధునిక సౌకర్యాలు కల్పించారు. ఇంటర్నెట్, వైఫై, టీవీ, సెల్‌ఫోన్ వంటివన్నీ అందుబాటులో ఉన్నాయి. దూరంగా టీవీలో 9-9=99 న్యూస్‌ఛానెల్‌ను చూస్తున్న వై.యస్.రాజశేఖరరెడ్డిని చూసిన దేవేంద్రుడు ఆయన వద్దకు వెళ్లాడు. ఏం రాజయ్యా... ఏంటి భూలోక వార్తావిశేషాలు అని అడిగాడు. రాజశేఖరరెడ్డి టీవీ చూడ్డం ఆపి... దేవేంద్రా, ఆంధ్రప్రదేశ్‌లో నా సోదరుల్లాంటి ఆనం సోదరులు తెలుగుదేశంపార్టీలో చేరుతున్నారంట... నాతో ఎంతో సన్నిహితంగా, కుటుంబసభ్యుల్లాగా ఉండే వాళ్లు. నేను ఇటొచ్చాక వాళ్లు గూడులేని పక్షులయ్యారు. సోనియాగాంధీ కాంగ్రెస్‌పార్టీని నాశనం చేయడంతో ఇక ఏ దిక్కూలేక చంద్రబాబును ఆశ్రయించారు. వీళ్లు ఒట్టి అమా యకులు. ఆ చంద్రబాబు మాయలో పడి మోసపోతారు. ముఖ్యంగా ఆ వివేకా అయితే మహా అమాయకుడు. 'సోగ్గాడే చిన్ని నాయనా' సినిమాలో నాగార్జున లాగా సోగ్గాడి మాదిరిగా తిరగడం తప్పితే ఇంకేమీ తెలియదు. ఎలాగైనా వారిని చంద్రబాబు ఉచ్చులో పడకుండా చూడాలన్నాడు. ఆ మాటకు దేవేంద్రుడు పగలబడి నవ్వుతూ... వాళ్లను అమాయకులంటున్న నీ అమాయకత్వాన్ని చూస్తే నాకు జాలేస్తుంది. చంద్రబాబు ఉచ్చులో వాళ్లు పడడం కాదు, వాళ్ల ఉచ్చులోనే చంద్రబాబు పడుతున్నాడు. టైం కలిసిరాక నెల్లూరులో వున్నారు గాని, వాళ్ల తెలివితేటలకు అంగుళం అదృష్టం తోడైవుంటే జాతీయ కాంగ్రెస్‌ను స్వాధీనం చేసుకుని సోనియాగాంధీని ఇటలీకి తరిమి ఉండేవాళ్లన్నాడు. మీరు వాళ్ల గురించి పొరపడుతున్నారు, పైకి మేధావుల్లా కనిపిస్తారు కాని, అన్ని తెలివితేటలు లేవు. వాళ్లను ఎలాగైనా నేను కాపాడాలి, విజయవాడకు వెళ్లకుండా అడ్డుకోవాలి. వాళ్లను చంద్రబాబు నుండి విడదీయాలి, నాకు ఎలాగైనా సాయం చేయండని వై.యస్. బ్రతిమలాడాడు. అప్పుడు దేవేంద్రుడు కొంత మెత్తబడి... వారి పట్ల నీ అభిమానాన్ని నేనెందుకు కాదనాలి, రాత్రే నేను కూడా 'సోగ్గాడే చిన్ని నాయనా' సినిమాను సిడి వేసుకుని చూసాను. సరిగ్గా విజయవాడ సభలో వివేకా ప్రసంగించే సమయానికి నీ ఆత్మను అతనిలో ప్రవేశపెడతాను, అయితే అది కేవలం 15 నిముషాల పాటే వుంటుంది. ఈలోపు నువ్వు చేయగలిగింది చేసుకో అని హామీ ఇచ్చాడు. దేవేంద్రుడికి వై.యస్. థ్యాంక్స్ చెప్పుకున్నాడు.

★★★★★

ఐఆర్20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరం. కాపువీధిలో స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(65+) నివాసం. ఇంట్లో వివేకాతో పాటు రామనారాయణరెడ్డి, ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, శుభకర్‌రెడ్డిలు ఉన్నారు. అందరూ చేతుల్లో పుస్తకాలు పట్టుకుని... "చంద్రబాబు సమర్థుడైన నాయకుడు, ఆయన పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందెను, కంప్యూటర్‌లను, వైఫైలను ఆయనే కనిపెట్టెను, నిజాయితీకి ఆయన ప్రతిరూపం, ఆయన పాలనలో ప్రజలు భోగభాగ్యాలతో తులతూగుతున్నారు..." దీనిని వాళ్లంతా 'అశోకుడు చెట్లు నాటించెను' అన్నరీతిలో బట్టీ పట్ట సాగారు. ఓ గంట పాటూ అది బట్టీపట్టడం అయ్యాక వివేకా అందరితో... ఈ మాటలను మనసులో కూడా మననం చేసుకుంటుండండి, మన నోట్లోంచి ఎక్కడా ఇందిరాగాంధీ, రాజీవ్, సోనియాల ప్రస్తావనే రాకూడదు, ఉదయాన్నే విజయవాడకు వెళ్లాలి. తొందరగా పడుకుని తొందరగా లేయండి అని చెప్పి ఆ క్లాసు ముగించి బెడ్‌రూంలోకి పోయి పడుకున్నాడు.

★★★★★

నెల్లూరు రైల్వేస్టేషన్‌లో సందడి సందడిగా వుంది. విజయవాడకు వెళ్ళే ఆనం ఎక్స్‌ప్రెస్ రెండో నెంబర్ ఫ్లాట్‌ఫారం మీద వుంది. పసుపు చొక్కా, పసుపు ఫ్యాంట్, పసుపు బూట్లు, కళ్లకు పసుపు రంగు అద్దాలు పెట్టిన వివేకా, వచ్చిన కార్యకర్తలందరినీ రైలెక్కిస్తున్నాడు. కొద్దిసేపటికే కార్యకర్త లతో ట్రైన్ నిండిపోయింది. అప్పుడు వివేకా, భానుశ్రీ, పిండి సురేష్, ఏ.సి.సుబ్బారెడ్డి, రంగమయూర్‌రెడ్డిలు ఇంజన్ వద్దకు పోయారు. వివేకా ఇంజన్ ముందు కర్పూరం వెలిగించి టెంకాయ కొట్టాడు. ఇక ట్రైన్ కదలబోతోంది. వివేకా ఏసి బోగీలో ఎక్కుతాడని అందరూ ఊహిస్తుండగా ఆయన టక్కున ఇంజన్‌లోకి ఎక్కాడు. ట్రైన్ డ్రైవర్‌లు ఆయనతో... సార్, మీరు ఇంజన్‌లోకి ఎక్కకూడదు. వెనుక బోగీలో కూర్చోండని చెప్పారు. అందుకు వివేకా... స్పెషల్ ట్రైన్ వేయించుకున్నది వెనుక బోగీలో కూర్చుని చెమ్మ చెక్క ఆడుకోవడానికా... నాకు ట్రైన్‌ను నడపాలనే కోరిక ఎప్పట్నుంచో వుంది. కాని ఏ ట్రైన్‌లో అంటే ఆ ట్రైన్‌లో మమ్మల్ని ఎక్కనీయరు కదా... అందుకే స్పెషల్ ట్రైన్ వేయించుకున్నా... దీనినన్నా నడిపే అవకాశమివ్వండంటూ మొండికేసాడు. ఇంజన్ డ్రైవర్లు మా ఖర్మ అనుకుంటూ ఆయనను ఇంజన్‌లో కూర్చోబెట్టారు. ట్రైన్ కదిలింది. వివేకా ట్రైన్‌ను నడుపుతున్నాడనే వార్త సెకన్లలో అన్ని బోగీలకు పాకింది. ట్రైన్‌లో వున్న వాళ్లంతా ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ఎవరి దైవాన్ని వాళ్లు ప్రార్థించసాగారు.

★★★★★

విజయవాడలో ఏ1 కన్వెన్షన్ హాల్. ఆనం అభిమానులతో హాల్ నిండిపోయింది. వేదిక మీద చంద్రబాబునాయుడు, కళా వెంకట్రావ్, పి.నారాయణ, పత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమ, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద రవిచంద్ర వంటి నాయకులున్నారు. ముఖ్య నాయకుల ప్రసంగాలయ్యాయి. ఆనం రామనారాయణరెడ్డి తన ప్రసంగాన్ని ముందు రోజు బట్టీ పట్టిన రీతిలోనే కొనసాగించి ముగించాడు. చివరగా ఆనం వివేకా లేచాడు. జనం అంతా ఆయన వెరైటీ స్పీచిస్తాడని ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. వివేకా మైకు పట్టుకున్నాడు. ఆ సమయంలోనే స్వర్గలోకంలో వున్న వైయస్ ఆత్మ దేవేంద్రుడి అనుమతితో వివేకాలో దూరింది. వివేకా మొదలుపెట్టాడు. ఈ దేశంలోనే అత్యంత అవినీతికర ముఖ్యమంత్రి ఎవరంటే అది చంద్రబాబే... మామను వెన్నుపోటు పొడిచి కుర్చీ కాజేసిన దుర్మార్గుడు. ఇతనెప్పుడూ నిజం చెప్పడు. నిజం మాట్లాడితే తల వేయి ముక్కలవుతుందని ఆయనకు శాపం వున్నట్లుంది. చంద్రబాబు నాలుకను చీరేసినా పాపం లేదు. చంద్రబాబుకు నవ్వడం చేతకాదు. నవ్వినా ఏడ్చినట్లే ఉంటుంది. రాష్ట్ర ప్రజలు బాగుండడం ఆయనకు ఇష్టం లేదు. రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టిన ఘనుడు... అని వివేకా ప్రసంగిస్తుండగా... చంద్రబాబుతో సహా అందరూ నిశ్చేష్టులై వింటున్నారు. పత్తిపాటి, సోమిరెడ్డి, నారాయణలైతే... చంద్రబాబును తిట్టడానికే ఆనం బ్రదర్స్ ఈ మీటింగ్ పెట్టించారని గుసగుసలాడుకోసాగారు. వివేకా అలా ప్రసంగిస్తుండగా 15నిముషాలు గడిచిపోయింది. దేవేంద్రుడు ఇచ్చిన గడువు అయిపోవడంతో వై.యస్. ఆత్మ వివేకా నుండి బయటకెళ్లిపోయింది. అప్పటిదాకా ఏం మాట్లాడాడో వివేకాకు అర్థంకాలేదు. రామనారాయణ వివేకా చెవి వద్దకు వెళ్లి... ఏంటి, పూనకం వచ్చినట్లు చంద్రబాబును అలా తిట్టేసావు, ఆ చంద్రబాబు ముఖం చూడు ఎలా మాడిపోయిందోనని మెల్లగా చెప్పాడు. నాకు ఏదో మైకం కమ్మినట్లయ్యింది. ఆ మైకంలో ఏం తిట్టానో నాకే అర్థం కావడం లేదు. అయినా నేను కవర్ చేసుకుంటానులే అంటూ వివేకా... గతంలో నేను చంద్రబాబు గారిని ఈ విధంగా తిట్టాను... మనిషన్నాక పాపాలు చేయడం సహజం... నేను కూడా ఆ పాపమే చేసాను. ఆ పుణ్యాత్ముడిని తిట్టిన నాలుకను ఒక్క నిముషం కూడా నోట్లో వుంచుకోను, కోసేస్తాను అంటూ ఆ పక్కనేవున్న మొద్దుబారిన కత్తిని చేతిలోకి తీసుకున్నాడు.... చంద్రబాబు టక్కున లేచి అతని చేతిలో కత్తిని లాక్కుని... గత తప్పును తెలుసుకున్నావు, నాకదే చాలు... ప్రాయశ్చిత్తానికి మించిన పరిహారం లేదు. నీవంటి నాయకుడు నా పార్టీలో ఉంటే ఈ రాష్ట్రాన్నే కాదు, ఈ దేశాన్నే దున్నేస్తాను అంటూ చంద్రబాబు అన్నదమ్ములిద్దరినీ కౌగిలించుకున్నాడు.

స్వర్గలోకం నుండి ఇది చూస్తున్న దేవేంద్రుడు... రాజయ్యా, ఇప్పుడు చెప్పు ఎవరు అమాయకులని అడిగాడు. వై.యస్. మౌనమే నా సమాధానమన్నట్లు ఉండిపోయాడు.

---

## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులు విధి నిర్వహించడంలో జాగ్రత్తపడాలి. చేపట్టిన పనులందు గాని వ్యవహారాలలో గాని తొందరపాటు పనికిరాదు. అనుకున్న పనులు నిదానంగా జరుగుతుంటాయి. ఖర్చులు ఎక్కువుగా ఉండినా సర్దుబాటు చేసికొనగలరు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. అనుకోని కొద్దిపాటి ఆదాయం లభించడం ఉంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

కుటుంబ పరంగా, ఉద్యోగ పరంగా అదనపు బాధ్యతలు పైనబడగలవు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు ఆలస్యం కాగలవు. ఈ వారం అన్ని విధాల ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలు తృప్తికరంగా ఉండి, రాబడి ఫరవాలేదనిపిస్తుంది. పనులు తొందర తొందరగా పూర్తి చేస్తారు. శుభకార్య నిర్ణయాలు జరుగుతాయి. ఆరోగ్యం బాగుంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కోర్టు వ్యవహారాలందు సమస్యలుంటాయి. అధికారులకు, యాజమాన్యాలకు దిగువ స్థాయి ఉద్యోగులతో ఇబ్బంది పరిస్థితులుంటాయి. నిర్ణయాలు చేయడం, పనులు చేయడంలో హడావిడి తగ్గించుకొనండి. వృత్తి వ్యాపారములందు అవకాశాలు, అభివృద్ధి ఆశించినంతగా ఉండదు. ఆర్థికపరమగు ఇబ్బందులుండినా సర్దుబాటు కాగలవు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

బంధుమిత్రులతో విభేదాలు రాకుండా చూచుకొనాలి. ఉద్యోగులకు అలవెన్సులు, అడ్వాన్సుల వంటివి ప్రకటింపబడే అవకాశములతో పాటు పనిభారం పెరుగుతుంది. వృత్తి జీవనం వారికి సామాన్యంగా జరుగుతుంది. ఆభరణాలు వస్త్రాలు వంటివి సమకూర్చుకొంటారు. అనుకున్న పనులు బాగా శ్రమపడి నెరవేర్చుకొంటారు. షేర్లు పెట్టుబడులపై ఆదాయముంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, అధికారులకు స్థాన మార్పులుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో చిన్న అవకాశాలు దొరకవచ్చును. అనవసర విషయాలకు దూరంగా ఉండండి. అనుకున్న పనులను పూర్తి చేస్తారు. కొత్త పెట్టుబడులకు తొందరపడకండి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం, కుటుంబ సభ్యులతో అనుకూలత తక్కువగా ఉండటం జరుగుతుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆదాయానికి తగిన ఖర్చులు పెరుగుతాయి. సేవా సంస్థలు వ్యాపార సంస్థల అభివృద్ధికి కృషి చేస్తారు. చెల్లింపులు, పన్నులు సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపకాలు పెరగడం, అనుకున్న పనులు జరుగుతున్నా టెన్షన్ పడుతుండటం ఉంటుంది. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఉద్యోగులకు ప్రోత్సాహకాలు లభించవచ్చును.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 22.01.2016 నుండి

తేది. 28.01.2016 వరకు

ఈ వారము మీనంలో కేతువు, సింహంలో గురువు, కన్యలో రాహువు, తులలో కుజుడు, వృశ్చికంలో శని, ధనుస్సులో బుధశుక్రులు, మకరంలో రవి, మిధున కర్కాటక సింహ కన్య రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

ముహూర్తములు లేవు.

తేది 26 మంగళవారము "రిపబ్లిక్ డే" దినోత్సవము

**పుష్య మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 22 | శుక్ర | త్రయోదశి | ఉ॥ గం.8.03వ॥ |
| తేది. 23 | శని | చతుర్దశి | ఉ॥ గం.7.30వ॥ |
| తేది. 24 | ఆది | పూర్ణిమ | ఉ॥ గం.7.10వ॥ |

**పుష్య మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 25 | సోమ | పాడ్యమి | ఉ॥ గం.7.21వ॥ |
| తేది. 26 | మంగళ | విదియ | ఉ॥ గం.8.02వ॥ |
| తేది. 27 | బుధ | తదియ | ఉ॥ గం.9.14వ॥ |
| తేది. 28 | గురు | చతుర్థి | ఉ॥ గం.10.52వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి వ్యాపారాలలో అవకాశాలు దొరికి అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. బంధుమిత్రుల ప్రాబల్యానికి లొంగవద్దు. ఆర్థిక సమస్యల పరిష్కారాలు, కోర్టు వ్యవహారాలలో అనుకూలత, రావలసిన బాకీలు కొంతవరకు లభించడం జరుగుతుంది. తలపెట్టిన పనులు సవ్యంగా జరుగుతాయి. సంప్రదింపులు, ఒప్పందాలు ఫలించగలవు. కుటుంబసభ్యులతో విభేదాలు రాకుండా ప్రవర్తించండి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి అవకాశాలు బాగుంటాయి. మాటలు, చేతలు కటువుగా, పరుషంగా లేకుండా చూచుకొనండి. ఆర్థికంగా బాగుంటుంది. ఆదాయానికి తగ్గ ఖర్చులుంటాయి. కొత్త వస్తువులను సమకూర్చుకొంటారు. ముఖ్య విషయాలలో పెద్దల సలహా తీసికొని నిర్ణయాలు చేయండి. రావలసిన బాకీలు లభించడం, కోర్టు వ్యవహారాలలో అనుకూలత బాగుంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

అనుకున్న పనులను సాధించి జరుపుకొంటారు. సోదరులకు అభివృద్ధి ఉంటుంది. కొత్త వస్తువులు గృహోపకరణాలు చేకూరుతాయి. వ్యవహారాల పేచీలు, ఒప్పందాలు పరిష్కారానికి వస్తాయి. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఏదో ఒక రూపములో అదనపు ఖర్చులు పైనబడతాయి. ప్రముఖులతో పరిచయాలు బలపడతాయి. కోర్టు కేసులందు అనుకూలత కలదు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావచ్చును. పనులందు తొందరపాటు హడావిడి తగ్గించుకొనండి. ఆర్థిక పథకాలు ఆలోచనలు కార్యరూపం దాల్చగలవు. వృత్తి వ్యాపార రంగాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. కొత్త వ్యాపారాలకు, పెట్టుబడులకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతారు. ఉద్యోగులకు అధికారులు, పబ్లిక్‌తో సమస్యలు రావచ్చును.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆవేశం అధికంగా ఉంటుంది. దానివల్ల బంధుమిత్రులతో సమస్యలు రాగలవు. చేపట్టిన పనులు సరిగా జరగవు. ఆదాయ వ్యయాలకు సామ్యత ఉండదు. అనవసర ఖర్చులు, గృహ వస్తు వాహన రిపేర్ల ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు చేజారిపోతాయి. ఇతరులచే మాటలు పడవలసి వస్తుంది. ఆవేశపూరిత నిర్ణయాలు చేయవద్దు.


## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. పనులు సరిగా జరుగును. వ్యాపకం పెరుగుటచే టెన్షన్ పడుతుంటారు. వృత్తి వ్యాపార రంగాల వారికి మంచి అవకాశాలు లభించగలవు. ఆదాయం సంతృప్తికరం. శుభకార్య, నూతన వస్త్రాభరణ ఖర్చులు అదనంగా ఉంటాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరుకుతాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది.

# 'రోటరీ హెల్పేజ్'కు లాయర్ వితరణ



గూడూరు పట్టణంలోని రోటరీ భవన్‌లో ఇటీవల రోటరీ హెల్పేజ్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఫలసరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. తిరుపతి ఎంపి వరప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో పాల్గొన్న 'లాయర్' వారపత్రిక ఎడిటర్ తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లల నిరాదరణకు గురైన తల్లిదండ్రులు ఎంతోమంది జీవిత చరమదశలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారిని ఆదుకునేందుకు గూడూరు రోటరీ క్లబ్ ముందుకు రావడం, వృద్ధుల జీవనానికి అవసరమైన ఫలసరుకులు పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. వృద్ధులకు రోటరీ చేయూత స్ఫూర్తిదాయకమన్నారు. వయోవృద్ధులకు మరింతగా సేవ చేసేందుకు రోటరీ హెల్పేజ్‌కు తనవంతుగా, తన తండ్రి స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి 21వ వర్ధంతిని పురస్కరించుకుని 20 వేల రూపాయలు వితరణగా అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆ మేరకు రోటరీ క్లబ్-గూడూరుకు చెందిన మాజీ అసిస్టెంట్ గవర్నర్ కొణిదెల మునిగిరీష్‌కు ఈ నెల18వ తేదీన స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి వర్ధంతిరోజున 20 వేల రూపాయల చెక్కును ప్రభు అందజేశారు.

## పింఛనుదార్ల సంఘం అధ్యక్షుడిగా
# మళ్ళీ మోహన్‌రావు



రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులంతా కలసి 12సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసుకున్న "రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం" నెల్లూరుజిల్లా శాఖ అధ్యక్షుడిగా డా॥ పి.మోహన్‌రావు రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. గత 3సంవత్సరాల కాలంలో ఆయన అధ్యక్షతన సంఘంలో జరిగిన పలు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంతో మోహన్‌రావుకి మళ్ళీ ఈ పదవి దక్కింది.

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వున్న ఇతర పెన్షనర్ల సంఘం అన్ని శాఖలకు నెల్లూరు శాఖ ఆదర్శంగా నిలవడం విశేషం. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా దాదాపు 60లక్షల రూపాయల వ్యయంతో ఈ సంఘం నెల్లూరులో తమకి ఓ సొంత గూడును ఏర్పాటు చేసుకోగలిగింది. ఏడాదికోసారి తాము బ్రతికే వున్నాం బాబూ అంటూ ప్రభుత్వానికి సమర్పించాల్సిన లైవ్ సర్టిఫికేట్ కోసం పెన్షన్‌దార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయకుండా అధికారులనే ఏడాదికోసారి తమ సంఘ కార్యాలయానికి పిలిపించుకుని అక్కడికక్కడే ఈ ధృవీకరణ పత్రాలను ఇచ్చే ఏర్పాటు ఈ సంఘం ప్రయోగాత్మకంగా చేపట్టింది.

తమ సంఘసభ్యులకు హెల్త్‌కార్డులు ఇప్పించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి వారు పని చేసిన శాఖలలో ఉద్యోగ విరమణ అనంతరం వారికి రావలసిన అన్ని ఉపకరణాలు(బెనిఫిట్స్) త్వరితగతిన అందేలా ఈ సంఘం కృషి చేస్తోంది.

నెల్లూరు శాఖ చేస్తున్న సేవలకు ఆకర్షితుడైన యం.యల్.సి విఠపు బాలసుబ్రహ్మణ్యం సంఘం విజ్ఞప్తి మేరకు ఈ సంఘానికి గౌరవాధ్యక్షులుగా వున్నారు. జనవరి 19వ తేదీ మంగళవారం జరిగిన ఎన్నికల్లో డా॥ మోహన్‌రావు అధ్యక్షుడిగా మరో విడత ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో పాటు సహాధ్యక్షుడిగా ఓ.సుబ్బరాముడు, ప్రధానకార్యదర్శిగా టి.కొండాచారి, కోశాధికారిగా కె.అప్పారావు, ఉపాధ్యక్షులుగా సి.వి.రమణయ్య, ఆర్.చెన్నకేశవయ్య, యం.వి.చలం, బి.రామిరెడ్డి, ఆర్.ఎస్తేరురాణి, యం.యస్.గౌస్, కార్యనిర్వాహక కార్యదర్శిగా యస్.పి.వి.నరసింహమూర్తిలు ఎన్నిక కాగా కార్యదర్శులుగా యస్.వి.సుబ్రహ్మణ్యం, పి.నాగరత్నమ్మ, పి.గురునాథరావు, జె.రామచంద్రయ్య, పి.రాధాకృష్ణమూర్తి, యన్.సీతారామరాజు, గౌరవసలహాదారులుగా వాస్తు రామచంద్ర, డి.రామసుబ్బారావులు ఎన్నిక కావడంతో పాటు మరికొంతమంది సభ్యులను డివిజన్‌లో కార్యదర్శులుగాను, కార్యవర్గ సభ్యులుగానూ ఎన్నుకున్నారు.



**సంక్రాంతి సందర్భంగా నెల్లూరు జడ్పీ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల్లో ప్రధమ బహుమతి పొందిన అమూల్యతో వాకర్స్ సంఘం ప్రతినిధులు**

## • పిఎస్ఎల్‌వి సి-31 సక్సెస్
# అంతరిక్షంలో మరో హిట్

అందరూ ఎంతో ఉత్కంఠభరితంగా ఎదురుచూస్తున్న పిఎస్ఎల్‌వి సి-31 సూపర్ సక్సెస్ అయింది. దీంతో, అంతరిక్షంలో భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం (ఇస్రో) మరో అద్భుతమైన హిట్‌ను సాధించినట్లయింది. ఉపగ్రహ దిక్సూచి వ్యవస్థను సొంతంగా ఏర్పాటుచేసుకోవాలన్న కలను సాకారం చేసుకునే దిశలో ఇస్రో అడుగులు వేస్తూ చేస్తున్న ప్రయోగాల్లో విజయాలను సాధిస్తూ ఎనలేని ఆత్మవిశ్వాసంతో, అపారమైన ప్రజ్ఞాపాటవాలతో మునుముందుకు సాగుతోంది. కొత్త ఏడాదిలో సత్తా చాటుకుంటూ, బుధవారం ఉదయం 9.31 గంటలకు ఇస్రో ప్రయోగించిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్‌వి) సి-31 రోదసిలోకి దూసుకువెళ్ళింది. 1425 కేజీల బరువున్న ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాప్ సిస్టమ్ (ఐఆర్ఎన్ఎస్ఎస్) ఉపగ్రహాన్ని 19.20 నిమిషాల్లో క్షేమంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. నింగినుంచి నిప్పులు చిమ్ముకుంటూ గగనతలంలోకి దూసుకువెళ్ళిన పిఎస్ఎల్‌వి సి-31 నిర్ధేశించిన సమయానికే కక్ష్యలోకి వెళ్ళింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలతో పాటు భారత ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతో, ఇస్రో ఖాతాలో ఇది మరో గ'ఘన' విజయంగా నమోదు కావడం అందరికీ గర్వకారణం. ఈ సందర్భంగా ఇస్రో ఛైర్మెన్ ఏఎస్ కిరణ్‌కుమార్ శాస్త్రవేత్తలను, ఈ విజయానికి కారకులైన వారందరినీ అభినందించారు. షార్‌లో ఈ ప్రయోగం దిగ్విజయమైన తర్వాత ఆయన మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడారు. భారత ప్రాంతీయ నావిగేషన్ ఉపగ్రహం కక్ష్యలోకి ప్రవేశించడం ఈ కొత్త సంవత్సరం శుభారంభమన్నారు. ఇప్పుడు ఐఆర్ఎన్ఎస్ఎస్ 5వ ఉపగ్రహాన్ని ప్రయోగించామని, మరో రెండు ఉపగ్రహాలను కూడా ప్రయోగించాల్సి వుందని, రాబోయే నెలల్లో అది కూడా సాకారమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది చివరలో భూ స్థిర ఉపగ్రహ ప్రయోగ వాహకం (జిఎస్ఎల్‌వి)-3 ప్రయోగం చేపట్టనున్నట్లు వివరించారు. కాగా, ఉపగ్రహ ప్రయోగ విజయంపై భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ఇస్రో బృందాన్ని అభినందించారు. ఈ ప్రయోగం విజయవంతమైనందుకు ఎంతో ఆనందిస్తూ, శాస్త్రవేత్తల క్రియాశీలతకు సంకల్పానికి అభినందనలు అంటూ భారత ప్రధాని నరేంద్రమోడీ అందరికీ అభినందనలు తెలిపారు.

### ఐఆర్ఎన్ఎస్ఎస్ వ్యవస్థతో ఎన్నో ఉపయోగాలు :

భారత్ స్వీయ పరిజ్ఞానంతో రూపొందిస్తున్న ఐఆర్ఎన్ఎస్ఎస్ ఉపగ్రహ వ్యవస్థతో ఎన్నో ఉపయోగాలున్నాయి. ఇందులో మొత్తంగా ఏడు ఉపగ్రహాలుంటాయని, ఈ వ్యవస్థ పూర్తిగా అందుబాటులోకి వచ్చాక వాటివల్ల ఎనలేని సేవలు అందుతాయని భావిస్తున్నారు. ఎన్ఎస్ఎస్ వ్యవస్థ అనేది ఒక దిక్సూచి వ్యవస్థలాంటిది. భూతలం, ఆకాశంతో పాటు మహాసాగరాల్లో సైతం దిశానిర్ధేశాలు చేయగల అపూర్వ మైన సేవలను ఈ వ్యవస్థ అందిస్తుంది. విమానాలు, ఓడల గమనాన్ని నిర్ధేశించడంలో ఎంతో సాయపడడమే కాక, విపత్తుల సమయంలో బాధితులకు సహాయకారిగా కూడా పనిచేస్తుంది. భద్రతా బలగాలకు సేవలందించడం, వాహనాల గమనాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంలోనూ ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ దేశం ప్రగతిపథంలో కొత్త పుంతలు తొక్కుతున్న వేళ.. అంతరిక్ష రంగంలోనూ మన శాస్త్రవేత్తలు ఇలా అద్భుత ప్రయోగాలతో విజయాలను సాధిస్తూండడం ఎంతో సంతోషకరం. అంతరిక్ష పరిజ్ఞానంలోనూ అసమాన ప్రతిభను చాటుకుంటూ భారత శాస్త్రవేత్తలు అంతర్జాతీయస్థాయి ఖ్యాతినందుకుని అందరి ప్రశంసలు అందుకుంటుండడం అందరికీ ఎంతో గర్వకారణం.

# రాజనీతి!

(మొదటి పేజీ తరువాయి)

ఆనం రామనారాయణరెడ్డన్నా ఓ మోస్తరుగా వెళ్ళాడు. తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణ, చంద్రబాబునాయుడు నాయకత్వ సామర్ధ్యం, జిల్లా నాయకులతో సమన్వయం వంటివాటిపైనే ఆయన మాట్లాడాడు. అయితే వివేకా వినడానికే వికారంగా మాట్లాడాడు. రాజకీయ నాయకులు నాలుక మడతపెట్టడం చూసాంగాని... వివేకా స్పీచ్ విన్నాక... నాలికను మెలికలు తిప్పడం చూసామని జనం అనుకుంటున్నారు. వివేకా ప్రసంగం జనానికి అంత రోతగా అనిపించింది. దాదాపు 20ఏళ్ల పాటు చంద్రబాబును వివేకా తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు. కాంగ్రెస్‌పార్టీలో చంద్రబాబును ఎక్కువుగా తిట్టిన నాయకులకు వరుసగా ర్యాంకులు ఇచ్చుకుంటూ పోతే ఖచ్చితంగా వివేకాకే మొదటి ర్యాంకు వస్తుంది. వై.యస్.రాజశేఖరరెడ్డికైనా, విహెచ్ హనుమంతురావుకైనా వివేకా తర్వాతే ఆ ర్యాంకులు వస్తాయి. చంద్రబాబును అంతగా తిట్టిన నోటితోనే విజయవాడ సభలో విపరీతంగా పొగిడాడు. భూమిని ఆయనే దున్నాలి, విత్తనం ఆయనే నాటాలి, నీళ్లు ఆయనే పోయాలి, మడవ ఆయనే కట్టాలి, పంట ఆయనే కోయాలి, ధాన్యం నూర్పిడి ఆయనే చేయాలి, పొయ్యి ఆయనే వెలిగించాలి, వంట ఆయనే వండాలి, చివరకు ముద్ద కూడా ఆయనే కలిపి నోట్లో పెట్టాలి... విభజన తర్వాత రాష్ట్ర పరిస్థితి ఇదని, చంద్రబాబే అన్నీ చేసి పెట్టాలని వివేకా భజన చేసిన తీరిది. టీవీలలో చూస్తున్న వారికే ఎబ్బెట్టుగా అనిపించింది. ఇక దగ్గరుండి విన్నవాళ్ల పరిస్థితి ఎలా ఉండిందో ఊహించడం కష్టమే! ఈ నెల 17వ తేదీన విజయవాడలోని ఏ-1 కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఆనం సోదరుల షోను అవకాశవాదనేతల అపూర్వ సంగమంగా పేర్కొనవచ్చు. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆనం సోదరులు తప్ప జిల్లాలో ఇంకెవరూ ఈ కలయికను హర్షించడం లేదు. ముఖ్యంగా జిల్లాలోని తెలుగుదేశం నాయకులకైతే ఏడుపొక్కటే తక్కువ. పార్టీలోకి ఆనం బ్రదర్స్ వస్తే అంతా ఆక్రమించేస్తారని వారికి తెలుసు. వారి టాలెంట్ మీద వున్న నమ్మకం అలాంటిది. కాని జిల్లాలో ఆనం వాళ్ల అవసరం చంద్రబాబుకు వుంది. కాబట్టి జిల్లా నాయకులకు ఇష్టం ఉన్నా లేకున్నా వారిని చేర్చేసుకున్నాడు. వాళ్లకు కూడా అధికారం అవసరం వుంది. కాబట్టి ఒకప్పుడు చంద్రబాబుతో సరిసమానమైన నాయకులై వుండి కూడా ఇప్పుడు ఆయన నాయకత్వంలో పనిచేయడానికి సిద్ధపడిపోయారు. ఆనం వాళ్ళన్నాక బల ప్రదర్శన బాగానే వుంటుంది. విజయవాడ షోకు ఒక రైలు, కొన్ని వందల వాహనాలలో నెల్లూరు, కడప జిల్లా బద్వేలు నుండి అనుచరులను విజయవాడకు తరలించి చంద్రబాబు ముందు తమ సత్తా చూపారు. చంద్రబాబు వాళ్లను చేర్చుకున్నది వారి వెనుక వున్న బలం, బంధుగణంపై అంచనా ఉండబట్టే. మొత్తానికి అవకాశవాద రాజకీయాలకు పరాకాష్టగా విజయవాడ షో మిగిలింది.

# 'బాలు'కు ఆత్మీయ సత్కారం

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించుకోవడం గొప్పవిషయమని అభినందించారు. మనిషి జీవితం ప్రకృతితో ముడిపడి వుందని, ప్రకృతిని ఎల్లవేళలా పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని ఈ సందర్భంగా ప్రధాని మోడీ అన్నారు. దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. అనంతరం, 'స్వచ్ఛభారత్' గేయాన్ని బాలూ ఎంతో హృద్యంగా ఆలపించి అందరి ప్రశంసలూ అందుకున్నారు. దేశంలోని ఎంతోమంది ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమం ఆద్యంతం ఎంతో వేడుకగా జరిగింది. సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని, ఢిల్లీలోని కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు నివాసంలో కోలాహలంగా జరిగిన ఈ కార్యక్రమంలో బాలూకు ఈ ఘనసత్కారం జరగడం విశేషం. ఈ సందర్భంగా 'స్వచ్ఛ భారత్'పై బాలూ ఆలపించిన అవగాహన గేయాన్ని విడుదల చేశారు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోడీ విచ్చేయడం శుభదాయకమన్నారు. ప్రతిభకు ప్రోత్సాహం ఇవ్వడం సమాజానికి ఎంతో అవసరమని, అందుకే ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంను ఈ సందర్భంగా సత్కరించడం జరిగిందని అన్నారు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని చేతుల మీదుగా తనకు ఈ సత్కారం జరగడం తనకు మధురానుభూతిని పంచిందంటూ ఈ సందర్భంగా బాలూ పేర్కొన్నారు. ఈ వేడుకల్లో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, తావర్‌చంద్ గెహ్లాట్, హర్షవర్ధన్, నజ్మా హెప్తుల్లా, జయంత్‌సిన్హా, వికెసింగ్, బిజెపి నేతలు రాంమాధవ్, విజయ్‌గోయల్, గోవా గవర్నర్ మృదులా సిన్హా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్‌జంగ్, సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ కెవి చౌదరి, రాజ్యసభ మాజీసభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ ఎన్‌వి రమణ, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రోహిణి తదితరులు పాల్గొన్నారు.



### హాస్టళ్ళ నిర్వహణ

# మరీ ఇంత అధ్వాన్నమా?

- బాధపడిన బొమ్మిరెడ్డి : అధికారుల తీరు పట్ల అసహనం
- జడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో చర్చ

జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటి సమావేశాలు సోమ, మంగళవారాల్లో జిల్లా పరిషత్ ఛైర్మెన్ ఛాంబర్‌లో నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమం మరియు హాస్టళ్ళలో విద్యార్థుల సౌకర్యాలపై ప్రధానంగా చర్చించారు.

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, సంక్షేమ హాస్టళ్ళ నిర్వహణ తీరు మరీ అధ్వాన్నంగా వుందని, అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించడంతో వాటి పరిస్థితి దయనీయంగా మారిందని జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి బాధను వ్యక్తం చేశారు. ఈ హాస్టళ్ళలో ఎంతోకాలంగా ఖాళీగా వున్న పోస్టులను ఇకనైనా ప్రభుత్వం భర్తీ చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి ఈ హాస్టళ్ళ దీనస్థితిని కన్నులకు గట్టడం విశేషం. ఆత్మకూరులో కోట్లాదిరూపాయలు వెచ్చించి రెండు హాస్టల్ భవనాలు నిర్మించి ఎనిమిది నెలలు గడిచినా వాటిని సంబంధిత శాఖలవారు ఇంకా వినియోగించుకోకపోవడం దారుణమన్నారు. జిల్లా అధికారులు జిల్లా కేంద్రంలో కూర్చుంటే సరిపోదని, వసతి గృహాలను ఎప్పటికప్పుడు సందర్శిస్తుండాలని, పర్యవేక్షణ లోపిస్తే కిందిస్థాయి సిబ్బంది బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తారని ఆయన అధికారులకు క్లాస్ తీసుకున్నారు. అధికారులు పొంతన లేని సమాధానాలు చెప్తుండడంతో ఆయన మండిపడ్డారు. జిల్లాలో అన్నిశాఖల వసతి గృహాలకు సంబంధించి పూర్తి వివరాలతో నివేదికను రూపొందించాలని అధికారులకు సూచించారు. వసతిగృహాల నిర్వహణకు ప్రభుత్వం కేవలం 10 వేలు మాత్రమే ఇస్తోందని ఈ సందర్భంగా అధికారులు ఛైర్మెన్ దృష్టికి తీసుకురాగా, ఆ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. జిల్లాలో వున్న 234 సంక్షేమ వసతి గృహాల్లో సుమారు 21వేల మంది విద్యార్థులు వున్నారని, ఆ హాస్టళ్ళలో సరైన పారిశుధ్య పరిస్థితులు కల్పించాలంటే ప్రస్తుతం ప్రభుత్వం అందజేస్తున్న 23 లక్షలు చాలవని, కనీసం కోటి రూపాయల దాకా కావాల్సివుంటుందన్న విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లామని ఛైర్మెన్ చెప్పారు. హాస్టళ్ళలో మరుగుదొడ్ల పరిశుభ్రం చేసేందుకు తగ్గ సిబ్బంది లేకపోవడం విచారకరమన్నారు. ఇవి అత్యంత దారుణంగా వుండడంతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఒక్కొక్క హాస్టల్‌కు నెలకు రెండువేల వంతున పారిశుధ్య సామగ్రికి కేటాయించాల్సి వుందని, పారిశుధ్య కార్మికునికి కనీసం మరో 3 వేలు అవుతుందని, ఈ లెక్కన జిల్లాలోని అన్ని హాస్టళ్ళ నిర్వహణకు కనీసం కోటి రూపాయలు కావాల్సి వుంటుందని ఆయన అంచనా వేశారు. ఈ విషయాలన్నీ ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు.

ఈ సమావేశంలో పాల్గొన్న సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ, తమ నియోజకవర్గం పరిధిలో మంజూరైన హాస్టళ్ళ భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సాయంత్రం జరిగిన స్థాయీ సంఘం సమావేశంలో వివిధ ఇంజనీరింగ్ శాఖ అధికారులు పాల్గొని ఆయా శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ రామిరెడ్డితో పాటు పలువురు జడ్పీటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

### ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో

# నేతాజీ విద్యార్థుల విజయకేతనం



ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో పదిమంది విద్యార్థులు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు శ్రీ నేతాజీ పైలట్ స్కూల్ కరస్పాండెంట్ యం.వి.సుబ్బారెడ్డి తెలిపారు. రెండవ లెవల్‌కి అర్హత సాధించిన విద్యార్థులను పాఠశాలలో ఆయన అభినందించారు. ఎం.సింధూర్, సిహెచ్.వి మణిదీప్, సిహెచ్ నిరూప, గోల్డ్‌మెడల్స్ సాధించగా, వి.సాయిరోహిత్, కె.మోహిత్‌రెడ్డి, ఎం.మోక్షజ్ఞ సిల్వర్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. ఎ.సాయికృష్ణ, పి.మోహనకృష్ణ, వై.ఉయానా, కె.సుహిత బ్రాంజ్‌మెడల్స్ పొంది తర్వాత లెవల్‌కి అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె.నరేంద్రరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ప్రసన్న, వైస్‌ప్రిన్సిపల్ డి.వాణి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వెల్లివిరిసిన సంక్రాంతి కాంతి



- పెన్నాతీరంలో వేడుకగా గొబ్బెమ్మల పండుగ

జిల్లాలో ఈసారి సంక్రాంతి కాంతి వెల్లివిరిసింది. గ్రామాలు, పట్టణాల్లోనూ ప్రజలు సంతోష సంరంభాలతో సంక్రాంతి పర్వ దినాలను జరుపుకున్నారు. ప్రత్యేకించి నెల్లూరు నగరంలోనూ సంక్రాంతి పండుగలు మరింత కోలాహలంగా జరిగాయి. సంక్రాంతి పర్వదినాల్లో భాగంగా భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు ఎంతో ఉత్సాహంతో జరుపుకున్నారు. పండుగ సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు, గాలిపటాల పోటీలు, క్రీడల పోటీలు, నృత్యాల పోటీలు అనేకప్రాంతాల్లో పోటాపోటీగా జరిగాయి. పోటీల్లో విజేతలకు ప్రోత్సాహకంగా నిర్వాహకులు బహుమతులు అందజేసి వారిని మరింత ఉత్సాహ పరిచారు. జిల్లాలో ఎక్కడ చూసినా పండుగ సందడే కనిపించింది. ఈ నెల 9,10 తేదీల్లో పక్షుల పండుగ జరిగినప్పటికీ, ఆ తర్వాత రోజుల్లో కూడా మార్చి నెల దాకా పక్షులు ఇక్కడే వుంటాయి కనుక, ఈ పండుగ రోజుల్లో నేలపట్టు, పులికాట్‌ల వద్దకు పెద్దసంఖ్యలో పర్యాటకులు విచ్చేసి పక్షుల అందాలను తిలకించి మురిసిపోయారు. నెల్లూరు నగరంలోనూ సంక్రాంతి పండుగలు ఎంతో సందడిగా జరిగాయి. సంక్రాంతి సంబరాల్లో భాగంగా నగరంలో ప్రత్యేకించి శనివారం రాత్రి కనుమ పార్వేట ఉత్సవం ఎంతో వేడుకగా జరిగింది. నగరంలోని అనేక ప్రముఖ ఆలయాల్లోని ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి, కనుమ పార్వేటకు ఉత్సవంలా తీసుకువచ్చారు. స్థానిక స్టోన్‌హౌస్ పేట వద్ద నుంచి మైపాడురోడ్డులోని పత్తివారిసత్రం దాకా పలు చోట్ల వేదికలు నిర్మించి ఈ దేవతామూర్తులను వేంచేపు చేసి భక్తుల సందర్శనార్థం వుంచారు. శ్రీ రాజరాజేశ్వరీదేవి, మూలాపేటలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి, పప్పులవీధి నుంచి శ్రీ వినాయకస్వామి, శ్రీ ప్రసన్నాంజనేయస్వామి, రంగనాయకులపేట నుంచి శ్రీ రంగనాథస్వామి, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి, నవాబుపేట నుంచి శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, శ్రీ కన్యకాపరమేశ్వరీదేవి, శ్రీ వినాయకస్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి, అదేవిధంగా ఇస్కాన్ మందిరం వేదికపై శ్రీకృష్ణ భగవానుడు తదితర దేవతామూర్తులను ఊరేగింపుగా తీసుకుని వచ్చి ఆయా వేదికలపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఈ ప్రాంతమంతా భక్తజనసముద్రంగా మారిపోయింది. నగర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పెద్దసంఖ్యలో ప్రజలు, యువత అందరూ కుటుంబాలతో సహ తరలివచ్చి ఒకే ప్రాంతంలో అత్యద్భుతంగా కొలువుదీరిన ఈ దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భ్రమరాంబాదేవి సమేత శ్రీ మల్లేశ్వర స్వామికి జాఫర్‌సాహెబ్ కాలువలో ఎంతో భక్తిశ్రద్ధలతో తెప్పోత్సవం నిర్వహించారు. వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

**వేడుకగా గొబ్బెమ్మల పండుగ : పెన్నాలో భక్తజన కోలాహలం**

పెన్నానదిలో గొబ్బెమ్మల నిమజ్జనోత్సవాలను (ఏటి పండుగ) ఒక పెద్ద పండుగలా నిర్వహిస్తారు. కనుమ పండుగ తర్వాత రోజు సాయంత్రం వేలాదిమంది ప్రజలు పెన్నా వద్దకు తరలివచ్చి, ఆటపాటలతో ఆనందోత్సాహాలతో గడుపుతారు. స్త్రీలు సకల సౌభాగ్యాలను ఇచ్చే గొబ్బెమ్మలను ఆరాధిస్తారు. ధనుర్మాసం ప్రారంభమైన రోజునుంచి బాలాజీనగర్ ప్రాంతంలోని కొన్ని కుటుంబాలవారు గొబ్బెమ్మలను ప్రతిరోజూ రంగవల్లుల మధ్య వుంచి, పూజలు చేస్తారు. ఆ తర్వాత ధనుర్మాసం అనంతరం ఆ గొబ్బెమ్మలను పవిత్రమైన పెన్నానదీ జలాల్లో నిమజ్జనం చేస్తారు. ఎంతోకాలం నుంచి నెల్లూరు నగరంలో ఈ ఆనవాయితీ వుంది. ఆదివారం సాయంత్రం గొబ్బెమ్మల పండుగ రోజున నెల్లూరు రంగనాయకుల గుడి పక్కనే వున్న పెన్నానదీ పరీవాహక ప్రాంతమంతా ఇసుకేస్తే రాలనంతగా జనం నిండిపోయింది. స్త్రీలు గౌరమ్మలను కీర్తిస్తూ ఓలలాడింపు పాటలు పాడారు. వేలాది మంది ప్రజలు ఈ ఏటిపండుగలో పాల్గొనేందుకు పెన్నా నది వద్దకు తరలివచ్చారు. యువకుల కోలాటాలు, కబడ్డీ తదితర ఆటలతో, చిన్నారుల పరుగులు కేరింతలతో.. ఆటపాటలతో ఏరంతా కోలాహలంగా.. సరదాల సందడిగా మారింది. చిన్నారులు, యువకులు ఎంతోమంది గాలిపటాలను ఎగురవేసి ఆనందించారు. నగర శాసనసభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని గాలిపటాలను పంపిణీ చేశారు. పతంగులను ఎగురవేసి ఏటి పండుగను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుద్దీప కాంతులతో పెన్నాతీరం శోభాయమానమైంది. నెల్లూరు నగరపాలక సంస్థ, జిల్లా అధికారయంత్రాంగం, దేవాదాయ ధర్మాదాయ శాఖ, పోలీసు అధికారులు, సిబ్బంది అందరూ ఈ వేడుకలన్నిటికీ ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు చేసి, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రంగనాయకులపేట వద్ద ట్రాఫిక్‌కు అవరోధాలు కలుగకుండా సిఐ మాధవరావు సిబ్బందితో పర్యవేక్షించారు. డిఎస్పీ వెంకటరాముడు, సిఐ రామారావు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. గొబ్బెమ్మల పండుగకు విచ్చేసిన భక్తులకు పలు స్వచ్ఛందసంస్థల వారు తమ వంతు సేవలందించారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు.

# ఎన్టీఆర్‌కు వాడవాడలా నివాళి



ఆంధ్రుల అభిమాన నటుడు, దివంగత ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు 20వ వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరుజిల్లా వ్యాప్తంగా ఆయన అభిమానులు వర్ధంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా ఎన్టీఆర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించి పలుచోట్ల రక్తదాన శిబిరాలు, అన్నదానాలు నిర్వహించారు. నెల్లూరు నర్తకి సెంటర్‌లో మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టిడిపి జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ కేవలం 9నెలల్లో పార్టీని ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి అయిన ఘనత ఎన్టీరామారావుదేనని కొనియాడారు. మాజీమంత్రి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ తొలుత తాను ఎన్టీఆర్ అభిమానినని, తర్వాతే తెలుగుదేశం పార్టీ కార్యకర్తనని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, సీనియర్ నాయకులు బెజవాడ ఓబుల్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, తాళ్ళపాక అనూరాధ, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జడ్ శివప్రసాద్, నూనె మల్లిఖార్జున యాదవ్, ధర్మవరపు సుబ్బారావు తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాళ్ళపాక దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సోమిరెడ్డి, బీద రవిచంద్రలు ప్రారంభించారు. సాయంత్రం ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు తాళ్ళపాక రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సంగీత విభావరిని నిర్వహించారు. ఎన్టీఆర్, బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ చిత్రాల్లోని మధురమైన పాటలను గాయకులు ఆలపించారు. నారా భువనేశ్వరి పిలుపు మేరకు 'లెజెండరీ రక్తదాన శిబిరాన్ని' ఏర్పాటు చేశారు.



# నెల్లూరు జైలుకొచ్చిన జగన్

## • వైసిపి నేతలకు పరామర్శ



వైకాపా అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి 21వ తేదీ నెల్లూరొచ్చారు. ఉదయం తిరుపతి ఎయిర్ పోర్టులో దిగి రోడ్డు మార్గాన వెంకటాచలం మండలం చెముడుగుంటలోని నెల్లూరు కేంద్ర కారాగారం వద్దకు వెళ్లారు. తిరుపతి ఎయిర్‌పోర్టు మేనేజర్‌పై దాడి కేసులో రిమాండ్‌లో వున్న రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శ్రీకాళహస్తి వైకాపా ఇన్‌ఛార్జ్ బియ్యం మధుసూదన్‌రెడ్డిలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా జైలు బయట ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆటవిక పరిపాలన సాగుతోందని, ప్రతిపక్ష నేతలను, ప్రశ్నించే ప్రజలను అణచివేసేందుకు ఈ ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయిస్తోందని ఆరోపించారు. ఎయిర్‌పోర్ట్ ఘటనలో వీడియోపుటేజీలను బయటపెడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. పీలేరు నియోజకవర్గంలో ప్రభుత్వ అక్రమాలను, అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే పెద్దిరెడ్డి కుటుంబంపై చంద్రబాబు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని జగన్ విమర్శించారు. జగన్ వెంట కడప ఎంపి వై.యస్.అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పివిఆర్ కల్యాణ మండపంలో

# శ్రీనివాసునికే తొలి కల్యాణం



నెల్లూరు, మినీబైపాస్‌రోడ్డులో అన్నమయ్య సర్కిల్ వద్ద సువిశాల స్థలంలో ప్రముఖ వ్యాపారవేత్త పులిమి వెంకటరెడ్డి సారధ్యంలో నిర్మించిన పివిఆర్ కల్యాణ మండపంలో 20వ తేదీ తొలి కల్యాణోత్సవాన్ని దేవదేవుడు శ్రీ వెంకటేశ్వరస్వామికే నిర్వహించారు. బుధవారం రాత్రి కనుల పండువగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి వేద పండితులు కల్యాణోత్సవాన్ని, పుష్పాభిషేకాన్ని నిర్వహించారు. అత్యంత అధునాతనంగా, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిర్మించిన ఈ కల్యాణ మండపాన్ని శ్రీనివాసుడి కల్యాణంతో ప్రారంభించడం శుభసూచకం. ఈ కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు నగర ప్రముఖులు, పులిమి వెంకటరెడ్డి బంధుమిత్రులు పెద్దఎత్తున విచ్చేసారు. ఓ పక్క కల్యాణోత్సవంలో పండితుల వేదమంత్రాలు, మరోపక్క ప్రముఖ గాయని శ్రీమతి జె.బాలార్క బృందం ఆలపించిన అన్నమయ్య కీర్తనలు అతిథులను ఆనంద పరవశులను చేశాయి. అతిథులందరికీ ప్రసాదాలందించి పులిమి వెంకటరెడ్డి స్వామివారి ఆశీస్సులతో పాటు అతిథుల అభినందనలందుకున్నారు.









## ఉత్తరక్రియలు

ఓ నాన్నా.. మీ మనసే వెన్న
అమృతం కన్నా.. అది ఎంతో మిన్న!

మీ ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

మన్నెం మనోరమ - భార్య
మన్నెం శ్రీహర్ష - కుమారుడు
మన్నెం శ్రీవర్ష - కుమార్తె

**ఉత్తరక్రియలు: తే. 28.01.2016ది గురువారం**
ఉదయం 10గంటలకు హైదరాబాదులోని అయ్యప్పసొసైటి రోడ్‌నెం.13లోని శ్రీనికేతన్ అభినందన అపార్ట్‌మెంట్‌లోని మా స్వగృహము నందు జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది.



**మన్నెం కృష్ణమోహన్‌రెడ్డి**

జననం : 07.09.1956 మరణం : 16.01.2016

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com